## నేటి కందం-నేటికి అందం

తీరుగ కామన్వెల్తున
భారీగా బరువు లెత్తి పసిడిని బొందన్
మీరా బాయీ చానును
తారగ శ్లాఘించె భారతావని ప్రీతిన్ !!

(48 కిలోల బరువును అవలీలగా ఎత్తి మీరాబాయీ చానూ కామన్ వెల్త్ గేమ్స్ లో బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడంతో భారత దేశం మొత్తం గర్వపడేలా స్పోర్ట్ స్టార్ అయింది. ఆమెను అందరూ అభినందిస్తున్నారు.)

-రాధశ్రీ

సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

## చురక

ప్రధాన మీడియా
బాధ్యతలో వైఫల్యం
సోషల్ మీడియా
చోదకంగా సాఫల్యం.
ప్రజల గొంతు కాస్తైనా
ప్రతిధ్వనిస్తే గుర్తింపు
ప్రభుత్వం భజనచేస్తే
పరాభవమే నర్తింపు.

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 28-7-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:277 పేజీలు:6 వెల: రూ.1/-


# విద్యార్థులపై దాడులు.. ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాల్సిందే: ఎంపీ రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ, జులై 27:దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీ ఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు.

బిహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే-47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులపై ఎలాంటి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమని, వారిని విడుదల చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. హామీకి విరుద్ధంగా వారిపై క్రూరమైన దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్‌లు ప్రయోగించారని, బిహార్‌లో ఏకే-47తో కాల్పులు జరిగాయని రాహుల్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బిహార్, ఢిల్లీ.. రాష్ట్రం ఏదైనా విద్యార్థుల గొంతు నొక్కివేయాలనే ధోరణే కనిపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం నిజాయతీ లేనిదని తాను గతంలోనే చెప్పానని, నిజమైన సంస్కరణలు తీసుకురావడం ఈ ప్రభుత్వానికి సాధ్యం కాదని రాహుల్ విమర్శించారు.

ఇచ్చిన హామీల నుంచి వెనక్కి తగ్గడంతో పాటు, విద్యార్థుల గొంతు అణచివేసేందుకు అన్ని మార్గాలను ఉపయోగిస్తోందని చెప్పుకొచ్చారు. దేశంలోని విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలన్నారు. విద్యార్థులపై కేసులు పెట్టడం కాకుండా, వారిపై దాడులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. కాగా, జులై 25న బిహార్ బంద్ సందర్భంగా సివాన్ జిల్లాలో పోలీసులు ఏకే-47తో కాల్పులు జరిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఓ పోలీసు అధికారిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

# పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 27: పబ్లిక్ ఎగ్జామ్స్ లీకేజీ నిరోధక సవరణ బిల్లును ఇవాళ కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. నీట్‌తో పాటు పలు పేపర్ల లీకేజీ అంశంలో కేంద్రం పటిష్టమైన చట్టాన్ని రూపొందిస్తున్నది. ఈ నేపథ్యంలో పబ్లిక్ ఎగ్జామ్స్ సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా పేపర్ లీకేజీలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునే చట్టాన్ని రూపొందించనున్నారు. ఇటీవల ఢిల్లీలో సీజేపీ విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్‌ను ఖండిస్తూ విపక్షాలు సభలో నినాదాలు చేస్తున్న సందర్భంలోనే మంత్రి జితేంద్ర సింగ్ ఆ సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. బిల్లును ప్రవేశపెట్టన వెంటనే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. రెండేళ్ల క్రితం సవరణ చేసిన లీకేజీ నిరోధక బిల్లును మళ్లీ సవరిస్తూ కేంద్రం కొత్త బిల్లును ప్రవేశపెట్టింది. పేపర్ లీకేజీ ఘటనల పరిష్కారం కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులను అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా ప్రవేశపెట్టిన పబ్లిక్ ఎగ్జామ్స్ లీకేజీ నిరోధక సవరణ బిల్లు ప్రకారం లీకేజీ కేసులను రెండు నెలల్లోనే పరిష్కరించనున్నారు

# ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

-చిన్నారులతో అల్పాహారం చేసిన భట్టి
-భావితరాలపై ప్రభుత్వ పెట్టుబడి
-అర్ధాకలితో ఏ బిడ్డా బడికి వెళ్లొద్దు
-పోషకాహార పథకానికి భట్టి ప్రశంసలు
-విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు
-మానవ వనరులే అసలైన సంపద
-పోషకాహార అల్పాహారానికి ప్రభుత్వం పెద్దపీట

ఖమ్మం, జులై 27: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజూ పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించేందుకు మధిరలో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. అనంతరం చిన్నారులతో కలిసి అల్పాహారం చేసిన ఆయన, అది తన రాజకీయ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు.



హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో అత్యాధునిక సాంకేతికత, పరిశుభ్రమైన వాతావరణంలో ఏర్పాటు చేసిన ఈ కమ్యూనిటీ కిచెన్ ద్వారా ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించడం అభినందనీయమని భట్టి విక్రమార్క అన్నారు.

ఏ బిడ్డా అర్ధాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని పేర్కొంటూ, రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఉచిత పోషకాహార అల్పాహార పథకం ఉచిత పథకం కాదని, భావితరాలపై ప్రభుత్వం చేస్తున్న పెట్టుబడని వ్యాఖ్యానించారు.

మానవ వనరులే రాష్ట్రానికి అసలైన సంపద అని భట్టి విక్రమార్క అన్నారు. ప్రతి విద్యార్థిని సానబెట్టిన వజ్రంలా తీర్చిదిద్ది ప్రపంచానికి దిశానిర్దేశం చేసే స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పాలన అంటే పెత్తనం కాదని, సమాజ హితం కోసం వనరులను వినియోగించి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడమే నిజమైన పాలన అని పేర్కొన్నారు.ప్రజల మధ్య నిర్వహించిన 'పీపుల్స్ మార్చ్'లో తాను చూసిన సమస్యలే నేడు ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలుగా రూపుదిద్దుకున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్య, సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

# ప్రతీకారం తప్పదు.. ఉక్రెయిన్‌కు ఇరాన్ తీవ్ర హెచ్చరిక..




న్యూఢిల్లీ, జులై 27:కాస్పియన్ సముద్రంలో తమ నౌకపై ఉక్రెయిన్ జరిపిన దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్‌కు చెందిన వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ చేసిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరకొంరు గాయపడ్డారు. ఈ ఘటనను ఐక్యరాజ్యసమితి చార్టర్‌కు విరుద్ధమైన చర్యగా అభివర్ణించిన ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ, దీనికి తగిన ప్రతీకారం తప్పదని స్పష్టం చేశారు.

కాస్పియన్ సముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ దాడి చేసింది. ఈ దాడి కారణంగా భారీ పేలుడు సంభవించి ఒక నావికుడు మరణించగా, మరో వ్యక్తి గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేసిన టెహ్రాన్, ఉక్రెయిన్ దౌత్య ప్రతినిధిని పిలిపించి వివరణ కోరింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పందిస్తూ.. 'ఈ దాడికి తగిన సమాధానం చెబుతాం' అని అన్నారు

ఇజ్రాయెల్ చెప్పడంతోనే ఉక్రెయిన్ ఈ చర్యకు పాల్పడిందని, యూరప్‌ను విస్తృత యుద్ధంలోకి లాగడమే ఈ దాడి వెనుక ఉద్దేశమని అరాఘ్చీ వ్యాఖ్యానించారు.కాగా, రష్యాకు సైనిక సామగ్రి తరలిస్తున్న నౌకలపై తమ బలగాలు దాడులు చేసినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. కాస్పియన్ సముద్ర మార్గాన్ని రష్యా-ఇరాన్ సైనిక సహకారం కోసం ఉపయోగిస్తున్నారని, అందుకే ఈ దాడులు చేపట్టామని పేర్కొన్నారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చిన కేటీఆర్, సీతక్క..



హైదరాబాద్, జులై 27:మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని పరామర్శించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, మంత్రి సీతక్క యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. కేటీఆర్ డాక్టర్లతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంసభ్యులను ఓదార్చిన కేటీఆర్, మంత్రి సీతక్క వారిలో మనోధైర్యాన్ని నింపారు. కేటీఆర్ వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

రెండు రోజుల క్రితమే యశోద హాస్పిటల్‌లో వైద్య పరీక్షలు చేయించుకున్న పెద్దికి ఆదివారం హనుమకొండలోని ఇంట్లో ఉదయం 7 గంటలకు తీవ్రమైన గుండెపోటు రాగా.. ఆయన భార్య స్వప్న వెంటనే దగ్గరలోని రోహిణి హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. కార్డియాలజిస్ట్ మమతారెడ్డి నేతృత్వంలో వైద్యుల బృందం వేగంగా స్పందించి అత్యవసర వైద్యం అందించారు. అత్యవసర సీపీఆర్ అనంతరం మెరుగైన వైద్యం కోసం పెద్ది సుదర్శన్ రెడ్డిని గ్రీన్ ఛానల్ ద్వారా హైదరాబాద్‌లోని యశోద దవాఖానకు తరలించారని తెలిసిందే

# కోమటిరెడ్డిని కలిసిన సీతక్క

హైదరాబాద్, జులై 27: రాష్ట్ర సచివాలయంలో రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లాలో రహదారుల అభివృద్ధి, మేడారం రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అంశాలపై ఇద్దరు మంత్రులు చర్చించారు. ములుగు జిల్లాలో ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలోని రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

అలాగే, మేడారంలో సమ్మక్క?సారలమ్మ జాతరకు భారీ సంఖ్యలో వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదించిన రింగ్ రోడ్డు నిర్మాణంపై కూడా సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు పనులను త్వరితగతిన



ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలపై ఇద్దరు మంత్రులు చర్చించినట్లు సమాచారం.

# అమెరికా ఫుడ్ ఫెస్టివల్‌లో కాల్పుల కలకలం.. ఇద్దరు మృతి

అమెరికాలో కాల్పులు కలకలం సృష్టించాయి. వాషింగ్టన్‌లోని సియాటెల్ నగరంలో నిర్వహిస్తున్న ప్రముఖ 'బైట్ ఆఫ్ సియాటెల్' ఫుడ్ ఫెస్టివల్‌లో దుండుగులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మృతిచెందగా.. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని సమీపంలోని హార్బర్ వ్యూ మెడికల్ సెంటర్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, క్షతగాత్రుల్లో రెండేళ్ల బాలుడు కూడా ఉండటం గమనార్హం.

సియాటెల్‌లో బైట్ ఆఫ్ సియాటెల్ పేరిట ప్రతి ఏటా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం 1982 నుంచి ఆనవాయితీగా వస్తోంది ఈ సందర్భంగా వందలాది ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు, మ్యూజిక్ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకకు సుమారు 3.5 లక్షల మంది హాజరవుతుంటారు. ఎప్పటిలాగే ఆదివారం సాయంత్రం 6 గంటల సమయంలో ఈవెంట్ నిర్వహిస్తుండగా వేదిక లోపలి నుంచి పలుమార్లు తుపాకీ పేలుడు శబ్దం వినిపించింది. దీంతో ప్రాణభయంతో జనాలు బయటకు పరుగులు తీయగా.. అక్కడ అంతా అస్తవ్యస్తంగా మారింది.

అయితే సియాటెల్ సెంటర్‌లో కాల్పుల ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. ప్రజలు ఆ ప్రాంతానికి వెళ్లవద్దని హెచ్చరించారు. ఘటనకు సంబంధించి ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని వెల్లడించారు.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను.. పదవి నుంచి తొలగించండి: హైకోర్టు

హైదరాబాద్, జులై 27: లోతుకుంట భూముల వ్యవహారానికి సంబంధించి తెలంగాణ హైకోర్టులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ కేసు విచారణ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తొలగించాలంటూ.. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి (సీఎస్) కీలక ఆదేశాలు జారీ చేసింది. సెక్రటరీ ర్యాంక్ స్థానంలో ఉన్న ఉన్నతాధికారి.. కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడం ఏ మాత్రం సమంజసం కాదని ధర్మాసనం పేర్కొంది.

### హైకోర్టుకు రంగనాథ్ క్షమాపణలు..

ఈ కేసు విచారణ సందర్భంగా హైకోర్టుకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షమాపణలు తెలిపారు. కోర్టులు, న్యాయ వ్యవస్థపై తనకు ఎంతో నమ్మకం ఉందని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అలాగే లోతుకుంట సర్వే నంబర్లు 1, 2 పరిధిలోని 40 ఎకరాల భూమిలోకి హైడ్రా బృందం వెళ్లలేదని కోర్టుకు వివరించారు. ఈ విషయంలో పిటిషనర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని కూడా తన అఫిడవిట్‌లో తెలిపారు. అయితే రంగనాథ్‌పై ఇప్పటికే 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని హైకోర్టు పేర్కొంది. ఒకే అధికారిపై ఇన్ని కోర్టు ధిక్కరణ పిటిషన్లు ఎందుకు నమోదయ్యాయంటూ ప్రశ్నించిన ధర్మాసనం.. ఈ అంశంపై వివరణ కోరింది.

# గ్రీన్ ఇండియా ఛాలెంజ్.. మొక్కలు నాటిన జెన్‌జీలు



హైదరాబాద్, జులై 27: నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర ప్రభుత్వం మీద వ్యతిరేకంగా ధర్నా చేసి విజయం పొందిన జెన్‌జీలు సింధు రెడ్డి, అస్మా, ప్రత్యూష హైదరాబాద్‌లోని వెంగళ్‌రావు పార్క్‌లో మొక్కలు నాటి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎల్‌నినో ప్రభావం తగ్గి వర్షాలు కురియాలన్నా స్వచ్ఛమైన గాలి లభించాలన్నా విరివిగా మొక్కలు నాటాలని పేర్కొన్నారు. యువకులు తలుచుకుంటే చెయ్యలేనిది ఏమీ లేదు అన్నారు.

జెన్‌జీలు అందరు ఒక్కో మొక్క నాటిన దేశంలో పచ్చదనం పెరుగుతుందన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమం ప్రారంభించిన మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాష్ట్ర కోర్డినేటర్ గర్రెపల్లి సతీష్, కయ్య వెంకటేష్, కిరణ్ రాథోడ్, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# 'కలాం సేవలు చిరస్మరణీయం'

## -సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు



నల్గొండ, జులై 27:భారత దేశ శాస్త్ర, సాంకేతిక రంగాలకు విశిష్ట సేవలు అందించి దేశం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహానీయుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం అని సూర్యాపేట జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. సోమవారం మాజీ రాష్ట్రపతి కలాం వర్ధంతి సందర్భంగా కోదాడ పట్టణం గాంధీ పార్క్ లో గల కలాం విగ్రహానికి స్వర్ణ భారతి ట్రస్ట్ సభ్యులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి తొలి మిస్సైల్ ను అందించిన ఘనత కలాంకే దక్కుతుందన్నారు. ఎక్కడో పేద కుటుంబంలో జన్మించి ప్రపంచ వ్యాప్తంగా అభిమానులును సంపాదించుకున్నారన్నారు. నేటి యువత కలం ను ఆదర్శంగా తీసుకుని ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చీఫ్ అడ్వైసర్ పైడిమర్రి సత్యబాబు, గరిణే శ్రీధర్, రాయపూడి వెంకటనారాయణ, వెంపటి వెంకటరమణ, దేవరశెట్టి శంకర్రావు , చిట్టిప్రోలు నారాయణ, గుడుగుంట్ల సాయి, వెంపటి ప్రసాద్, కిట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రకృతితో సామరస్యంగా ఉంటేనే జీవకోటి మనుగడ

## (28 జూలై "ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం" సందర్భంగా)

సౌర మండలంలోని నవగ్రహాల్లో ఏకైక భూగ్రహం మాత్రమే జీవుల ఆవాసానికి అనువుగా ఉన్నది. భూమిపై అవసరమైన గాలి, సూర్యరశ్మి, ఖనిజ నిక్షేపాలు, ఇంధన సహజ నిధులు, జల వనరులు లాంటివి సమృద్ధిగా ఉన్నాయి. నేడు ఈ భూగృహంపై 820 కోట్ల మానవాళి నివసిస్తున్నది. 2037 నాటికి ప్రపంచ జనాభా 900 కోట్ల మార్కు తాకనున్నదని అంచనా. నేడు భూమిపై నివసిస్తున్న 820 కోట్ల ప్రజలతో పాటు సకల జీవరాసులు సురక్షితంగా మనుగడ సాధించడానికి తగిన ప్రకృతి వనరులు కావాలి. నిత్యం మనం వినిగించుకుంటున్న ప్రకృతి వనరులు దినదినం తరుగుతున్నాయి లేదా నాణ్యతను కోల్పోతున్నాయి. వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య విఘాతాలు, అడవుల నరికివేత, కాలుష్యం పెరగడం, శిలాజ ఇంధనాల వాడకం లాంటివి ప్రకృతి పరిరక్షణకు వ్యతిరేకంగా పని చేస్తున్నాయి. గాలి, నీరు, నేల నివాస యోగ్యతను కొల్పోతున్నదనే నిపుణులు హెచ్చరిక నడుమ డిజిటల్ మానవుడు తనకేమీ పట్టనట్టుగా ప్రకృతి విధ్వంసం కొనసాగిస్తూ, వాతావరణ ప్రతికూల మార్పులకు కారణం అవుతున్నాడు. ప్రకృతి ప్రసాదించిన అమూల్య వనరులను పరిమితుల్లో వాడుకుంటూ, పరిరక్షణ చర్యలను తీసుకుంటూ, రేపటి తరానికి ఆస్తితో పాటు నివాసానికి అనువైన ప్రకృతిని కూడా అందించడానికి పూనుకోవాలి.

### ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం-2026 ఇతివృత్తం:

ఆరోగ్యకర జీవకోటి జీవనానికి కావలసిన ప్రకృతి సహజత్వాన్ని కాపాడుకోవాలనే నినాదంతో ప్రజల్లో కనీస అవగాహన కలిపించడానికి ప్రతి ఏట 28 జూలై రోజున "ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం(వరల్డ్ నేచర్ కన్జర్వేషన్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినం -2026 ఇతివృత్తంగా "ప్రకృతితో సామరస్యంగా ఉండే సుస్థిర జీవనశైలి పాటించడం (లివింగ్ సస్టేనబ్లిల్లీ ఇన్ హార్మొనీ విత్ నేచర్)" అనే అంశాన్ని తీసుకొని అలడవగాహన కల్పిస్తున్నారు. ఈ రోజున "పునరుద్ధరణ, నిలకడ, బాధ్యత (రీస్టోరేషన్, రెసిలియెన్స్, రెస్పాన్సిబులిటీ)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహించాలి. భూగృహంపై ఉన్న జలం 2050 వరకు మాత్రమే సరిపోతుందని, నేడు తగు జాగ్రత్తలు తీసుకోని యెడల తర్వాత నీటి కొరత కోరల్లో జీవకోటి సతమతం కానున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### ప్రకృతి పరిరక్షణ చర్యలు:

నేడు మనకు అందుబాటులో ఉన్న నీటిని పరిమితంగా వాడుకోవాలని, గాలి కాలుష్యాన్ని తగ్గించుకోవాలని, నేలల్ని ఎడారులుగా మార్చ వద్దనే ఇంగితంతో పర్యావరణ హిత మానవ జీవనశైలిని అవలంబించాలి. మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు ప్రతిన బూనడం, అడవుల నరికివేతను కట్టడి చేయడం నిరంతరం కొనసాగాలి. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ సూత్రాలకు కట్టుబడి ఉండాలి. పవర్ వినియోగంతో పాటు శిలాజ ఇంధన వాడకాలను పరిమితం చేయాలి. పేపర్‌లెస్ వ్యాపారాలను ప్రోత్సహించాలి. పౌర సమాజంలో పర్యావరణ పరిశుభ్రతను కాపాడాలి. మన ఇంటి జీవ విచ్ఛిన్న వ్యర్థాలను ఎరువులుగా మార్చుకోవాలి. గృహ శుభ్రతకు ప్రకృతి విధ్వంసం చేసే విష రసాయనాలను వాడరాదు. తరగని పునరుత్పాదక ఇంధనాలను మాత్రమే విధిగా వాడుకోవాలి.

ప్రకృతిని కాపాడడం అందరి బాధ్యత. మనం చేసే చిన్న చిన్న చర్యలు రేపటి ఆరోగ్యకర ప్రకృతికి ప్రాణాధారం అవుతాయని తెలుసుకోవాలి. ప్రజల్లో ప్రకృతి విధ్వంస దుష్ప్రభావాలను, పరిరక్షణ మార్గాలను వివరించాలి. హిత ప్రకృతి మాత్రమే మన ఆరోగ్య సౌభాగ్యమని గమనించాలి. భారత ప్రభుత్వం ప్రకృతి పరిరక్షణ యజ్ఞానికి "నేషనల్ గ్రీన్ ఇండియా మిషన్", "నమామి గంగే మిషన్", "పర్యావరణ హిత జీవనశైలి (లైఫ్)" అనబడే పథకాలను తీసుకొని అమరులు పరుస్తున్నది. ప్రకృతిని రక్షిద్దాం, రేపటి తరాన్ని కాపాడుదాం. ప్రకృతి పరిరక్షణే జీవకోటి సంరక్షణ అని నినదిద్దాం.



-మధుపాళీ
9949700037

# శాంతి, అభివృద్ధి, బలమైన జాతీయ భద్రత జమ్మూ కాశ్మీర్ దిశను మార్చేశాయి: డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, జులై 27:చరిత్రలోనే దేశ విభజన అతి పెద్ద పొరపాటు అని కేంద్ర శాస్త్ర-సాంకేతిక మంత్రిత్వశాఖ, భూవిజ్ఞాన శాఖ (స్వతంత్ర బాధ్యత).. ప్రధాని కార్యాలయు, సిబ్బంది-ప్రజా ఫిర్యాదులు- పింఛన్లు, అణు శక్తి-అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. భారత్- పాకిస్థాన్ మధ్య పరిష్కారం కాకుండా మిగిలి ఉన్న ఏకైక అంశం పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌ను (పీఓజేకే) తిరిగి స్వాధీనం చేసుకోవటమేనని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ భద్రతా వ్యవస్థలో నిర్ణయాత్మక మార్పు వచ్చిందని.. బాహ్య దురాక్రమణలపై భారత వ్యవహార శైలి కేవలం ప్రతిస్పందించే ధోరణి నుంచి సంకల్పం, సన్నద్ధత, నిర్ణయాత్మక చర్యలతో కూడిన వైఖరికి మారిందని ఆయన అన్నారు.

ఢిల్లీలోని కాశ్మీరీ కల్చరల్ సెంటర్‌లో మిర్పూర్ బలిదాన్ భవన్ సమితికి చెందిన పీఓజేకే యూత్ ఫోరం భాగస్వామ్యంతో 'జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ ఫోరం' నిర్వహించిన 27వ కార్గిల్ విజయ్ దివాస్ స్మారక కార్యక్రమంలో డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి బన్సురి స్వరాజ్ గౌరవ అతిథిగా విచ్చేశారు. కార్గిల్ యుద్ధ వీరుడు కల్నల్ కే.కే. శర్మ (ఎస్సీ, ఎన్ఎం- బార్) అధ్యక్షత వహించారు. 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణ త్యాగాలు చేసిన వీర జవాన్లకు నివాళులర్పించేందుకు పీఓజేకే యూత్ ఫోరంతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమానికి జమ్మూ కాశ్మీర్ పీపుల్స్ ఫోరం కన్వీనర్ శ్రీ మహీందర్ మెహతా నాయకత్వం వహించారు. స్మరించుకోవడమే కాకుండా జాతీయ సంకల్పాన్ని పునరుద్ధరించుకునే రోజుగా కార్గిల్ విజయ్ దివాస్‌ను డాక్టర్ జితేంద్ర సింగ్ అభివర్ణించారు. ఈ విజయం భారత సాయుధ దళాల అజేయమైన ధైర్యసాహసాలకు.. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, భౌగోళిక సమగ్రతను పరిరక్షించడంలో భారత్‌కు ఉన్న నిశ్చలమైన నిబద్ధతకు ప్రతీక అని ఆయన అన్నారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు నిరంతర అప్రమత్తత, జాతీయ ఐక్యత ఎంతో అవసరమన్న ఆయన.. అందుకే కార్గిల్ నేర్పిన పాఠాలు నేటికీ అత్యంత ప్రాధాన్యమైనవని పేర్కొన్నారు.

కార్గిల్ ఘర్షణకు సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేసిన కేంద్ర మంత్రి.. 1999 ఘటనలను విడిగా చూడలేమని దేశ విభజనతో ప్రారంభమైన వరుస పరిణామాల కొనసాగింపుగానే దీనిని భావించాలని అన్నారు. దేశ విభజనను చరిత్రలోనే అతిపెద్ద పొరపాటని ఆయన పేర్కొన్నారు. ఇది తీవ్ర మానవ వేదనకు కారణమైందని, మిలియన్ల మందిని నిర్వాసితులను చేసిందని.. 1947, 1965, 1971, కార్గిల్ యుద్ధాలతో పాటు సరిహద్దు దాటి జరిగే నిరంతర తీవ్రవాదం, పరోక్ష యుద్ధం వంటి దశాబ్దాల శత్రుత్వానికి పునాది వేసిందని చెప్పారు. స్వతంత్ర భారతంలో చోటుచేసుకున్న అత్యంత తీవ్రమైన మానవ తా విషాదాల్లో కాశ్మీరీ పండిట్ల నిర్వాసం ఒకటని ఆయన గుర్తుచేశారు.

గడిచిన దశాబ్ద కాలంలో భారతదేశం జాతీయ భద్రతా విధానాన్ని ప్రాథమికంగా మార్చుకుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఉగ్రవాదం పట్ల ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబించటంతో పాటు సరిహద్దు నిర్వహణను బలోపేతం చేసిందని చెప్పారు. ప్రతిస్పందించే భద్రతా విధానం స్థానంలో బాహ్య దురాక్రమణలకు నిర్ణయాత్మకంగా సమాధానమిచ్చే ముందస్తు వ్యూహాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ మార్పు వల్ల జాతీయ ఆత్మవిశ్వాసం గణనీయంగా పెరిగిందని, దేశ భౌగోళిక సమగ్రతను పరిరక్షించే భారత్ సామర్థ్యం మరింత బలోపేతమైందని ఆయన పేర్కొన్నారు.

శాంతి, అభివృద్ధి ఒకదానికొకటి పరస్పరం దోహదపడతాయని తెలిపిన కేంద్ర మంత్రి.. ఇటీవలి సంవత్సరాల్లో జమ్మూ కాశ్మీర్‌లో చోటుచేసుకున్న అపూర్వమైన మార్పులను ప్రస్తావించారు. కాశ్మీర్ లోయకు రైల్వే అనుసంధానం, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి, నూతన ఎయిమ్స్ సంస్థల ఏర్పాటు, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, వేగవంతమైన అభివృద్ధి కార్యక్రమాలను ఆయన పేర్కొన్నారు. వీటి ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కూడా పెరిగిందని చెప్పారు. నిరంతర శాంతి వేగవంతమైన అభివృద్ధికి దారితీసిందని.. అదే సమయంలో నిలకడైన స్థిరత్వానికి అభివృద్ధి ఒక శక్తిమంతమైన సాధనంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు. రక్షణ ఉత్పత్తుల తయారీలో దేశం స్వయంసమృద్ధి సాధించడం జాతీయ భద్రతను మరింత బలోపేతం చేసిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీని భారత్ భారీగా విస్తరించిందని, అధునా తన వ్యూహాత్మక సామర్థ్యాలను పెంపొందించుకుందన్న ఆయన.. రక్షణ పరికరాల ఎగుమతిలో దేశం కీలకంగా మారుతోందని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సాధించిన ఈ ప్రగతి భారత సాంకేతిక పురోగతికి, వ్యూహాత్మక ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని చెప్పారు.

నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) అవతలి పరిణామాలను ప్రస్తావిస్తూ జమ్మూ కాశ్మీర్‌లో కనిపిస్తోన్న అభివృద్ధి వేగం పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్ (పీఓజేకే) ప్రజలకు ప్రేరణగా నిలుస్తోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. 1994లో పార్లమెంట్ ఏకగ్రీవంగా ఆమోదించిన తీర్మానాన్ని గుర్తుచేసిన ఆయన.. భారత్-పాకిస్థాన్ మధ్య పాక్ ఆక్రమిత జమ్మూ కాశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడం తప్ప వేరే ఏ వివాదమూ లేదని పేర్కొన్నారు. పీఓజేకే భారత్‌లో విడదీయరాని భాగమని ఆయన పునరుద్ఘాటించారు.

కార్గిల్ యుద్ధ అమరవీరులకు ఘనమైన నివాళులర్పిస్తున్నట్లు తెలిపిన కేంద్ర మంత్రి.. వారి ధైర్యసాహసాలు, దేశభక్తి, నిస్వార్థ త్యాగాల నుంచి యువత స్ఫూర్తి పొందాలని పిలుపునిచ్చారు. కార్గిల్ సమరయోధుల స్ఫూర్తి ప్రతీ భారతీయుడిని మరింత బలమైన, సురక్షితమైన, ఆత్మనిర్భరత కలిగిన, అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణం వైపు నడిపిస్తుందని.. అదే సమయంలో దేశ ఐక్యత, సార్వభౌమత్వం, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడంలో మన సమష్టి నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు.

# తాకట్టు విడిపిస్తామని మోసం చేసిన కేసు విచారణ చేపట్టిన ఎస్ ఐ ప్రసాద్

ఖమ్మం, జులై 27: బంగారం తాకట్టు నుంచి విడిపించి కొనుగోలు చేస్తామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.1.51 లక్షలు అపహరించిన ఘటనపై బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది.ఎస్ఐ మేడ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన బానోతు సంతోష్‌ను కొందరు వ్యక్తులు నాగినేనిప్రోలు రెడ్డిపాలెంకు పిలిచి, తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించేందుకు రూ.1,51,000 నగదుతో రావాలని కోరారు. వారి మాటలు నమ్మి నగదుతో వచ్చిన సంతోష్‌ను మాయమాటలతో నమ్మించి, నగదును తీసుకుని నిందితులు పరారయ్యారు.

మోసపోయానని గ్రహించిన బాధితుడు బూర్గంపహాడ్ పోలీసులను ఆశ్రయించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా శనివారం సాయంత్రం నాగినేనిప్రోలు గ్రామంలో ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్ఐ నాగ బిక్షం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థినికి రూ.50 వేల ఆర్థిక సాయం చేసిన ప్రభుత్వ విప్

నల్గొండ, జులై 27:కష్టపడి, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం అన్నారు. చిట్యాల పట్టణానికి చెందిన బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మిర్యాల దీపిక కుటుంబం కళాశాల ఫీజు చెల్లింపులో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం స్థానిక మాజీ కౌన్సిలర్, కో-ఆప్షన్ సభ్యుడు బెల్లీ సత్తయ్య యాదవ్ ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు.

విద్యార్థిని తండ్రి మిర్యాల నరేష్ కుమార్‌కు రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి, దీపిక ఎలాంటి ఆటంకాలు లేకుండా చదువు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఆర్థిక సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే వేముల వీరేశంకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# మైనర్‌లకు వాహనాలు ఇస్తే కేసులు తప్పవు

## -తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై హెచ్చరిక

ఆదిలాబాద్, జులై 27: మైనర్ యువకులకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వాహన యజమానులతో పాటు సంబంధిత వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని కుంటాల ఎస్సై జి. నరేష్ హెచ్చరించారు.

ఆదివారం కుంటాల మండల కేంద్రంతో పాటు కల్లూరు గ్రామంలో పోలీసులు ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్ యువకులు నంబర్ ప్లేట్లు లేకుండా ద్విచక్ర వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనానికి నంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ట్రిపుల్ రైడింగ్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనదారులు తప్పనిసరిగా అన్ని వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్‌లకు వాహనాలు అప్పగించే తల్లిదండ్రులు, యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

అనంతరం పట్టుబడిన ముగ్గురు మైనర్ యువకులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గంగాజలాలతో గ్రామదేవతలకు ఘనంగా జలాభిషేకం



ఆదిలాబాద్, జులై 27: మండలంలోని లోలం గ్రామంలో తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం గ్రామదేవతలకు గోదావరి గంగాజలాలతో జలాభిషేకం చేసి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు.

సర్పంచ్ సూర శ్రీలత సాయన్న యాదవ్, గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆనవాయితీ ప్రకారం గ్రామదేవతలకు గంగాజలాలతో శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సూర శ్రీలత సాయన్న యాదవ్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది తొలి ఏకాదశి సందర్భంగా గ్రామ సంప్రదాయం ప్రకారం గ్రామదేవతలకు గంగాజలాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

గ్రామంలో పిల్లాపాపలు సుఖసంతోషాలతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగా పండాలని గ్రామదేవతలను ప్రార్థించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా భాజాభజంత్రాలు, శివసత్తుల పూనకాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామదేవతలకు మొక్కులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో శాంతి, సుభిక్షాలు నెలకొని రైతులకు పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థనలు చేశారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముత్యం, వీడీసీ అధ్యక్షుడు సాయన్న, నర్సయ్య, భీమేష్, రాకేష్, సుధాకర్, తోపనం రవి, వార్డు సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి మున్సిపల్ యూనియన్ ఆర్థిక సహాయం

నిజామాబాద్, జులై 27: భీంగల్ మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న కోట నర్శయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో భీంగల్ మున్సిపల్ యూనియన్ నాయకులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం యూనియన్ తరఫున రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు సున్నపు ఓంకార్ మాట్లాడుతూ, కోట నర్శయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. వారి కుటుంబానికి యూనియన్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పల్లికొండ శ్రీధర్, పతాని నవీన్, బచ్చల వారి విశ్వనాథ్, జంబుక రాజారాం, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.పదివేల ఆర్థిక సాయం

భీమ్‌గల్ టౌన్, ఆంధ్రప్రభ: భీంగల్ మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఎలక్ట్రిషన్‌గా విధులు నిర్వహిస్తున్న కోట నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబ సభ్యులను భీంగల్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి బోదిరే నాగమణి స్వామి, మున్సిపల్ కమిషనర్ డి. గజానంద్, కౌన్సిలర్లు పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సయ్య అంత్యక్రియల నిర్వహణ కోసం మున్సిపాలిటీ తరఫున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తోట సతీష్, అంజుమ్ అలీ, సందీప్, ప్రజాప్రతినిధులు జేజే నర్సయ్య, కన్నె సురేందర్, ఆరేపల్లి నాగేంద్ర, బోదిరే నర్సయ్య, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంసాగర్‌లో మునిగి నలుగురు మృతి

నిజామాబాద్, జులై 27: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ వరద కాలువలో ఈత కొట్టేందుకు దిగిన నలుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో నిజామాబాద్ ఆటోనగర్‌కు చెందిన షేక్ ఖలీం (24), హాజీ (24), అమ్మాన్ (17)తోపాటు హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు ఉన్నారు.

ఆదివారం నిజామాబాద్ జిల్లా ముప్కాల్-మెండోర మండలాల సరిహద్దు పరిధిలోని ముప్కాల్ లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద ఈత కోసం నలుగురు యువకులు దిగారు. ఈత కొడుతూ కాలువ మధ్యలోకి వెళ్లిన నలుగురు నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. సీపీ పర్యవేక్షణలో రెస్క్యూ ఆపరేషన్ వేగవంతమైంది. గజ ఈతగాళ్లు, స్థానిక మత్స్యకారులతోపాటు పోలీస్ బృందాలను రంగంలోకి దించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున రెస్క్యూ ఆపరేషన్ కూడా ముమ్మరంగా చేశారు.

నలుగురు మృత దేహాలు లభ్యమయ్యాయి. నిజామాబాద్ నగరంలోని ఆటోనగర్ ప్రాంతానికి చెందిన అమ్మాన్, ఖలీం, హాజీలతో పాటు హైదరాబాద్‌కు చెందిన మరో ఇద్దరు మొత్తం ఐదుగురు కలసి ఆదివారం సాయంత్రం ఈత కోసం కాలువలో దిగారని, ఇందులో నలుగురు లోతును సరిగ్గా అంచనా వేయలేక నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారని పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో ఒకరినొకరు కాపాడుకునే క్రమంలో ప్రాణాలు కోల్పోయారన్నారు. ఐదో యువకుడు ప్రమాదం నుండి తప్పించుకుని, ఒడ్డుకు చేరుకుని స్థానికులకు సమాచారం అందించాడని, స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రిగా శ్రీ ప్రహ్లాద్ జోషి బాధ్యతల స్వీకారం



న్యూ ఢిల్లీ, జులై 27:కేంద్ర విద్యాశాఖ మంత్రిగా శ్రీ ప్రహ్లాద్ జోషి ఈ రోజు కర్తవ్య భవన్‌లో అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం వినియోగదారుల వ్యవహారాలు-ఆహార-ప్రజా పంపిణీ శాఖతోపాటు నవ్య-పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఇవాళ విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించగానే ఆ శాఖ ఉన్నతాధికారులతో శ్రీ జోషి తన అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యాశాఖ పరిధిలో ప్రస్తుతం అమలవుతున్న పథకాలు, ఇతర కార్యక్రమాల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు. విద్యాశాఖ సహాయ మంత్రి శ్రీ జయంత్ చౌదరి కూడా ఇందులో పాల్గొన్నారు.

అలాగే, ఉన్నత విద్యా విభాగం కార్యదర్శి డాక్టర్ వినీత్ జోషి, పాఠశాల విద్య-అక్షరాస్యత విభాగం కార్యదర్శి శ్రీ టి.కె.అనిల్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# జానకంపేట లక్ష్మీనరసింహుని ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక శోభ



నిజామాబాద్, జులై 27:ఎడపల్లి మండలం జానకంపేట గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. తొగుట సరస్వతి పీఠాధిపతి శ్రీ శ్రీశ్రీ మాధవానంద స్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. వేదమంత్రాల నడుమ ఆలయ ప్రాంగణంలోకి విచ్చేసిన స్వామికి అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికి సత్కరించారు.

ముందుగా ఆలయ పవిత్ర పుష్కరిణిలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన మాధవానంద స్వామి, అనంతరం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. స్వామివారి దివ్య మంగళ రూపాన్ని దర్శించిన అనంతరం క్షేత్రంలోని ఆధ్యాత్మిక ప్రశాంతతను కొనియాడుతూ భక్తులకు ఆశీర్వచనాలు అందించారు.

అనంతరం ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యార్థం నూతనంగా చేపట్టిన గిరి ప్రదక్షిణ మార్గం నిర్మాణ పనులను స్వామి పరిశీలించారు. పనుల నాణ్యత, భక్తులకు అందాల్సిన సౌకర్యాలపై ఆరా తీసిన ఆయన, క్షేత్రాభివృద్ధికి ఉపయోగపడే పలు విలువైన సూచనలు, సలహాలు అందించారు. భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి గింజుపల్లి వేణు జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ చరిత్ర, క్షేత్ర మహిమ, నిత్య పూజా విధానాలు, ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి స్వామికి వివరించారు. క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం, దాతలు, గ్రామస్థుల సహకారంతో చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు.

మాధవానంద స్వామి రాకతో ఆలయ ప్రాంగణంలో భక్తిపారవశ్యం నెలకొంది. స్వామి ఆశీర్వాదం పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో జానకంపేట గ్రామస్థులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను విజయవంతం చేశారు.

# పాకిస్థాన్ దుస్సాహసానికి పాల్పడితే దీటుగా తిప్పికొట్టగల భారత్ సామర్థ్యం 'ఆపరేషన్ సిందూర్'కి ఉంది...

న్యూఢిల్లీ, జులై 27:పాకిస్థాన్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా అనూహ్య తీవ్రతతో దీటుగా తిప్పికొట్టగల భారత్ సామర్థ్యం 'ఆపరేషన్ సిందూర్'తో నిరూపితమైందని రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా ద్రాస్ సెక్టార్‌లో ఇవాళ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాకిస్థాన్‌తో ఎలాంటి చర్చలూ ఉండబోవని, ఏదైనా ఉంటే- అది కేవలం పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే)పైనే కేంద్రీకృతం అవుతాయని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. ఆ ప్రాంతం భారత్‌లో అంతర్భాగమని, పాక్ అక్రమంగా దాన్ని ఆక్రమించుకున్నదని చెప్పారు. భారత సార్వభౌమాధికారానికి విఘాతం కలిగించే ప్రతి దుష్ట చర్యకూ 'ఆపరేషన్ సిందూర్' తరహాలో భారత రక్షణ దళాలు దీటుగా బదులిస్తాయని హెచ్చరించారు. మన రక్షణ దళాల చావుదెబ్బను ఉగ్రవాదులు, వారి పోషకులు ఇప్పటికే రుచి చూశారని, భవిష్యత్తులో కూడా ఎలాంటి దుశ్చర్యకు దిగినా ఫలితం ఇలాగే ఉంటుందని పేర్కొన్నారు.

పాకిస్థాన్లో సైన్యం, ఉగ్రవాదుల మధ్య విభజన రేఖ చెరిగిపోయిందని, ఆ దేశం ఉగ్రవాదాన్ని తన ప్రభుత్వ విధానంలో అంతర్భాగం చేసుకున్నదని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. "ఉగ్రవాద సంస్థలకు సైన్యం ఆశ్రయమివ్వడమే కాకుండా, వాటితో చేయి కలిపి దుశ్చర్యలకు పాల్పడుతోంది. అందుకే, ఆపరేషన్ సింధూర్ సమయంలో ఉగ్రవాదులు, వారికి అండగా నిలిచే ప్రభుత్వాల మధ్య భారత్ వ్యత్యాసం చూపలేదు. ఇకపైనా మన వైఖరి ఇలాగే ఉంటుందని స్పష్టం చేశాం" అని ఆయన వ్యాఖ్యానించారు.

కార్గిల్ యుద్ధానికి 27 ఏళ్లు ముగిసిన నేపథ్యంలో భారత్, పాక్ మార్గాలు పూర్తిగా వేరయ్యాయని రక్షణ మంత్రి అన్నారు. ఆ మేరకు "భారత్ నవ్యావిష్కరణల బాట పడితే, పాక్ ఇంకా పాత పద్ధతిలోనే చొరబాట్లకు దారులు వెదుకుతోంది. భారత్ చిప్ డిజైన్‌లో నిమగ్నమైతే, పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించడమే పనిగా పెట్టుకుంది. భారత్ అంకురావరణ వ్యవస్థను బలోపేతం చేస్తుంటే పాక్ ఉగ్రవాద వ్యవస్థను రూపొందిస్తోంది. భారత్ సెమీకండక్టర్లను తయారు చేస్తుంటే, పాక్ ఆత్మాహుతికి ఉగ్రవాదులను సిద్ధం చేస్తున్నది. భారత్ మానవసహిత అంతరిక్ష యాత్రలకు శ్రీకారం చుడుతుండగా, పాకిస్థాన్ ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నది. భారత్ అంతరిక్షంలోకి ఉపగ్రహాలను పంపుతుంటే, పాక్ ఉగ్రవాదులను సరిహద్దులు దాటించడంపై దృష్టి సారిస్తోంది. భారత్ ప్రపంచానికి సాఫ్ట్‌వేర్‌ను అందిస్తుంటే, పాకిస్తాన్ స్లీపర్ సెల్స్ (ఉగ్రవాదుల)ను ఎగుమతి చేస్తోంది. భారత్ డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తుంటే- పాకిస్థాన్ ఉగ్రవాద దుర్బోధలతో యువతను భ్రష్టు పట్టిస్తున్నది. భారత్ యూపీఐతో ప్రపంచాన్ని అనుసంధానిస్తుంటే, పాకిస్థాన్ హవాలా నెట్‌వర్క్‌లతో ఉగ్రవాదాన్ని ముడిపెడుతోంది. సంక్షిప్తంగా- రెండు దేశాల మార్గాలు పూర్తిగా భిన్నం. పాకిస్థాన్ తన దుష్ట పన్నాగాలతో మన సౌభాగ్య పథానికి అడ్డుపడేందుకు సాహసిస్తే, మన రక్షణ దళాలు తగువిధంగా స్పందించడానికి సదా సిద్ధంగా ఉన్నాయి" అని ఆయన స్పష్టం చేశారు.

ఎలాంటి ముప్పు విషయంలోనైనా రక్షణ దళాలు నిర్ణయాత్మకంగా ప్రతిస్పందించ పూర్తి స్వేచ్ఛనిచ్చే రాజకీయ సంకల్పం కేంద్ర ప్రభుత్వానికి ఉందని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు. మన సైనికులు దేశ సరిహద్దులను కాపలా కాస్తుండగా, శత్రువు భారత్ వైపు తేరిపార చూడటం కూడా దుర్లభమని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

మాతృభూమి రక్షణ కోసం 1999 కార్గిల్ యుద్ధంలో ప్రాణతర్పణం చేసిన భారత వీర సైనికులకు ఆయన ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా పరమవీర చక్ర పురస్కార గ్రహీతలు కెప్టెన్ విక్రమ్ బాత్రా, కెప్టెన్ మనోజ్ కుమార్ పాండే సహా, దేశానికి... ముఖ్యంగా యువతకు స్ఫూర్తినిస్తున్న ఎందరో వీర సైనికులను ఆయన స్మరించుకున్నారు. వ్యక్తిగత విజయం, జాతీయ కర్తవ్యం మధ్య వ్యత్యాసాన్ని అర్థం చేసుకోవాలని భావించే ప్రతి యువకుడికీ కార్గిల్ విజయ దినోత్సవం ఒక స్ఫూర్తిదాయక దినమని ఆయన అభివర్ణించారు. "త్యాగం, సేవల స్ఫూర్తి ఏ దేశానికైనా వెన్నెముక వంటిదని ఈ విజయ దినోత్సవం మనకు బోధిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

కార్గిల్ యుద్ధ స్మారక చిహ్నం భారత సంపూర్ణతను ప్రతిబింబిస్తుందని, అమరవీరులు దేశంలోని ప్రతి ప్రాంతానికీ ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. "వైవిధ్యం, వైరుధ్యంతో నిమిత్తం లేకుండా మనకు హాని తలపెట్టే వారిని ఈ ఐక్యతా కుడ్యం గంభీరంగా నిరోధిస్తుంది" అని ఆయన అన్నారు.

పశ్చిమాసియాలో, రష్యా-ఉక్రెయిన్ మధ్య సంఘర్షణలు రక్షణ దళాల సామర్థ్యంతోపాటు దేశాల పునరుత్థాన సామర్థ్యం, సహనం, సంకల్పాన్ని కూడా పరీక్షించాయని రక్షణశాఖ మంత్రి చెప్పారు. భారత సైన్యం, బలమైనదేగాక సమర్థమైనదని, అయినప్పటికీ జాతీయ భద్రత పరిరక్షణ కర్తవ్యం ప్రతి పౌరుడిపైనా ఉంటుందని చెప్పారు. 'దేశమే ప్రథమం' అనే స్ఫూర్తి, క్రమశిక్షణ, కర్తవ్య భావనల ప్రాధాన్యాన్ని వివరిస్తూ- ప్రతి భారతీయుడూ సైనికుల తరహాల చైతన్యంతో మెలగాలని సూచించారు. "ప్రతి పౌరుడు ఒక సైనికుడిగా మారాలన్నది నా ఉద్దేశం కాదు. దేశం ఎప్పుడైనా తన ప్రజల ప్రత్యక్ష-పరోక్ష మద్దతును అభిలషిస్తే మాతృభూమి రక్షణ కోసం ముందుకు రావడానికి ప్రతి భారతీయుడు మానసికంగా, నైతికంగా, శారీరకంగా సిద్ధంగా ఉండాలి. ప్రతి సైనికుడు అన్నింటికంటే ముందుగా ఒక భారతీయుడైన తరహాలోనే, ఒక సైనికుడి ధైర్యం, క్రమశిక్షణ, దేశభక్తి ప్రతి భారతీయుడిలో సదా సజీవంగా ఉండాలి" అన్నారు.

వికసిత భారత్-2047 ఆర్థిక శ్రేయస్సును మించినదని వ్యూహాత్మక బలం, సాంస్కృతిక ప్రతిష్ఠ, సామాజిక సామరస్యంపై నిబద్ధతకు అదొక ప్రతీకని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. దేశ పురోగమనంలో అడుగడుగునా కార్గిల్ యుద్ధ వీరులు ప్రదర్శించిన అంకితభావం, కర్తవ్య స్ఫూర్తిని అలవర్చుకోవడం ద్వారానే ఈ స్వప్నం సాకారం కాగలదని చెప్పారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం జాతీయ భద్రతకు, సైనికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని ప్రముఖంగా ప్రస్తావించారు. "ఏ కాలంలోనైనా, ఏ పరిస్థితులలోనైనా మన సరిహద్దుల వద్ద సదా అప్రమత్తంగా ఉండాలని కార్గిల్ యుద్ధం మనకు పాఠం నేర్పింది" అన్నారు. కాలానుగుణంగా సైనిక సామర్థ్యాల ఆధునికీకరణ, కార్యాచరణ సామర్థ్యం పెంపుపై సమానంగా దృష్టి సారిస్తూ, సరిహద్దు మౌలిక సదుపాయాలను నిరంతరం బలోపేతం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

'యే దిల్ మాంగే మోర్' అంటూ కెప్టెన్ విక్రమ్ బాత్రా ఇచ్చిన ప్రసిద్ధ నినాదం స్ఫూర్తితో రక్షణ రంగ ఉత్పాదనలో స్వయం సమృద్ధివైపు శరవేగంగా పయనిస్తున్నామని శ్రీ రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. "మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు, భారత్ తన రక్షణావసరాల్లో 65-70 శాతం దిగుమతి చేసుకునేది. అయితే, నేడు మన రక్షణ పరికరాలలో 65 శాతాన్ని భారత గడ్డపైనే తయారు చేస్తున్నాం. ఈ రోజు మన సైనికులు స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'ఆకాశ-తీర్' గగనతల రక్షణ నియంత్రణ వ్యవస్థను నిర్వహిస్తున్నా. తదుపరి తరం ఆకాశ్ క్షిపణిని కూడా మనం రూపొందించుకున్నాం. భారత తొలి స్వదేశీ విమాన వాహక నౌక 'ఐఎన్ఎస్ విక్రాంత్', తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్', తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్', అధునాతన తేలికపాటి హెలికాప్టర్ 'ధ్రువ్', ప్రధాన యుద్ధ ట్యాంక్ 'అర్జున్', 'పినాక' మల్టీ-బ్యారెల్ రాకెట్ లాంచర్, 'అస్త్ర' గగనతల క్షిపణి, ఆధునిక డ్రోన్లు-కౌంటర్ డ్రోన్ వ్యవస్థలు కూడా రక్షణ దళాల యుద్ధ సంసిద్ధతను బలోపేతం చేస్తున్నాయి. కానీ, 'ఈ మనసు ఇంకా ఏదో కోరుకుంటోంది'.. మరిన్ని ఆధునిక ఆయుధాలు, భావితరం యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, క్షిపణులను దేశంలోనే తయారు చేయడానికి మేం కృషి చేస్తూనే ఉంటాం" అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా 1999 నాటి 'ఆపరేషన్ విజయ్' సమయంలో అమరులైన వీరయోధుల స్మరణార్థం రక్షణ మంత్రి సెనోటాఫ్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి మౌనం పాటించారు. లదాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ కుమార్ సక్సేనా, ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్, నార్తర్న్ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ, 14 కార్ప్స్ జీఓసీ లెఫ్టినెంట్ జనరల్ మదన్‌రాజ్ పాండే, 8 మౌంటెన్ డివిజన్ జీఓసీ మేజర్ జనరల్ ఏపీ సింగ్ తదితరులు కూడా శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌తో కలిసి కార్గిల్ యుద్ధ వీరులకు నివాళి అర్పించారు. ఈ 'శ్రద్ధాంజలి సమారోహ్'లో సీనియర్ సైనిక-పౌర ప్రముఖులు, కార్గిల్ యుద్ధ వీరులు, శౌర్య పురస్కార గ్రహీతలు, వీరనారులు, మృతుల కుటుంబ సభ్యులు, స్థానిక పౌరులు కూడా పాల్గొన్నారు.

సందర్శకుల పుస్తకంలో సంతకం చేసిన అనంతరం- ఆపరేషన్ విజయ్ సమయంలో భారత సైనికులు ప్రదర్శించిన ధైర్యం, సంకల్పం, అకుంఠిత స్ఫూర్తిని శ్రీ రాజ్‌నాథ్ వివరించారు. ఈ సందర్భంగా ఇద్దరు నాన్ కమిషన్డ్ అధికారులు సమర్పించిన 'గౌరవ గాథ'ను వీక్షించారు. కార్గిల్ యుద్ధ చరిత్ర-వారసత్వాన్ని ప్రజలకు మరింత విస్తృతంగా చేరవేసేలా రూపొందించిన 'వర్చువల్ వాక్‌త్రూ పోర్టల్'ను కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన స్మారక కుటీరాన్ని సందర్శించి, వీరభూమి వద్ద నివాళి అర్పించారు.

అనంతరం ప్రముఖులు, సైనికులు, వారి కుటుంబాలతో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ముచ్చటిస్తూ, తేనీరు సేవించారు. అనంతరం, కార్గిల్ విజయ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన 'శౌర్య విజయ యాత్ర' పేరిట మోటార్ సైకిల్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. అంతకుముందు ఆయన 2026 జూలై 14న న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం నుంచి కూడా ఒక ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.

ద్రాస్‌లో రక్షణశాఖ మంత్రి రక్షణ దళాలకు నాయకత్వం వహిస్తూ కార్గిల్ విజయ దినోత్సవంలో పాల్గొనగా, ఆ శాఖ సహాయ మంత్రి శ్రీ సంజయ్ సేథ్ న్యూఢిల్లీలోని జాతీయ యుద్ధ స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరులకు నివాళి అర్పించారు. చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్ఎస్ రాజా సుబ్రమణి, చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, చీఫ్ ఆఫ్ ది నేవల్ స్టాఫ్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, రక్షణ కార్యదర్శి శ్రీ రాజేష్ కుమార్ సింగ్, వైస్ చీఫ్ ఆఫ్ ది ఆర్మీ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ సందీప్ జైన్ తదితరులు కూడా వీరయోధులకు నివాళి అర్పించారు.

# సరిహద్దు గ్రామాలను దేశానికి చివరి గ్రామాలుగా కాకుండా వాటికి మొదటి గ్రామాలుగా ప్రాధాన్యం ఇస్తున్నాం: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 27:సరిహద్దు గ్రామాలను మౌలిక సదుపాయాలతో అభివృద్ధి పరచే 'వికసిత వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్ 2026' భాగస్వాములతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు ముఖాముఖీ ముచ్చటించారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా లభించిన అద్భుతమైన స్పందనను, భాగస్వామ్యాన్ని కొనియాడిన ఆయన, దేశంలోని దాదాపు 250 జిల్లాల నుంచి విచ్చేసిన ఉత్సాహవంతులైన యువ భాగస్వాములకు ఆత్మీయ స్వాగతం పలికారు.

కొద్ది సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన 'మేరా యువ భారత్ – మై భారత్' వేదిక నేడు కోట్లాది మంది యువతను చేర్చుకుంటూ విస్తరించడాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఈ యువజన నెట్‌వర్క్ చేపడుతున్న క్రియాశీలక సేవలను అభినందిస్తూ, 'వికసిత భారత్ డైలాగ్' నుంచి 'వికసిత వైబ్రంట్ విలేజ్ ప్రోగ్రామ్' వరకు వివిధ కార్యక్రమాల్లో యువత చూపుతున్న విశేష సామర్థ్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. "నేడు 'మై భారత్' యువ మిత్రులు దేశవ్యాప్తంగా అత్యంత ప్రశంసనీయమైన సేవలను అందిస్తున్నారు" అని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

వికసిత భారత్ యువ నేతల సమావేశం సమయంలో ఈ క్షేత్రస్థాయి కార్యక్రమానికి పడిన పునాదిని ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. యువత కేవలం వర్చువల్ సంభాషణలకే పరిమితం కాకుండా, దేశ వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవాలనేది తన ఆకాంక్ష అని ఆయన అన్నారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లడఖ్ సరిహద్దు గ్రామాలకు యువతను పంపడం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశాన్ని ఆయన వివరిస్తూ, మూడు లక్షల మంది భాగస్వాముల నుంచి ఎంపిక చేసిన 400 మందికి పైగా యువతను అక్కడి స్థానిక సంస్కృతుల్లో మమేకమవ్వడానికి, ఆ ప్రాంతాల్లోని ప్రజల బలమైన దేశభక్తి ఆకాంక్షలను ప్రత్యక్షంగా తెలుసుకోడానికి పంపినట్లు వెల్లడించారు. "మీ సంస్కృతిని అక్కడి సంస్కృతితో అనుసంధానించడమే 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్'కు అత్యుత్తమ ఉదాహరణ" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

ప్రభుత్వ బాధ్యతలు చేపట్టడానికి ముందే విస్తృత పర్యటనల ద్వారా సరిహద్దు సమాజాలతో తమకు ఏర్పడిన ప్రగాఢమైన వ్యక్తిగత సంబంధాలను ప్రధానమంత్రి గుర్తు చేసుకున్నారు. సరిహద్దుల్లో విధి నిర్వహణలో ఉన్న సైనికులతో కలిసి దీపావళి పండుగను జరుపుకోవడం తనకు ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

తన వ్యక్తిగత అనుభవాలను సరిహద్దు పర్యటనల నుంచి తిరిగి వచ్చిన యువత పంచుకున్న ఉత్సాహభరితమైన అనుభూతులతో ఆయన పోల్చారు. సరిహద్దుల్లోని స్థానిక ప్రజల అపారమైన ఆప్యాయత నుంచి సాయుధ బలగాల అసమాన ధైర్యసాహసాల వరకు యువత ప్రత్యక్షంగా చూసిన విశేషాలను ప్రస్తావించారు. 'కార్గిల్ విజయ్ దివస్' సందర్భంగా దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ల అత్యున్నత త్యాగాలకు ప్రధాని నివాళులర్పించారు. "అత్యంత సవాలుతో కూడిన పరిస్థితుల్లో కూడా ఆ వీర జవాన్లు విజేతగా త్రివర్ణ పతాకాన్ని ఎగరేశారు. ఈ 'వికసిత వైబ్రంట్ విలేజ్' మొత్తం అనుభవం నిజంగా ఎంతో అద్భుతమైనది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

వికసిత గ్రామాలను 'వికసిత భారత్' నిర్మాణానికి అత్యంత కీలకమైన పునాది రాళ్లుగా అభివర్ణించిన ప్రధానమంత్రి, ఈ మార్పుదాయక ప్రయాణ నిరంతర, విస్తృత స్వభావాన్ని ప్రత్యేకంగా ఉద్ఘాటించారు యువతరానికి లభించే ఈ క్షేత్రస్థాయి భాగస్వామ్యం జాతీయ దృష్టికోణాన్ని విస్తరించడమే కాకుండా, దేశాభివృద్ధిలో తమవంతు అర్థవంతమైన సహకారాన్ని అందించాలనే వారి వ్యక్తిగత సంకల్పాన్ని మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ అనుసంధానం ప్రాముఖ్యతను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు "దేశ యువత క్షేత్రస్థాయి పరిశీలనతో మమేకమైనప్పుడు, అది 'వికసిత భారత్' సుదూర దృష్టికోణాన్ని మరింత విస్తృతం చేస్తుంది" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు

సరిహద్దు ప్రాంతాల్లోని కఠినమైన జీవన పరిస్థితులను ప్రస్తావిస్తూ, అన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతి క్షణం దేశభక్తిని శ్వాసిస్తూ జీవిస్తున్న స్థానిక ప్రజలను శ్రీ మోదీ ప్రశంసించారు. గతంలో రోడ్లు, విద్యుత్, ఆసుపత్రులు వంటి కనీస ప్రాథమిక వసతులు కూడా లేకుండా ఈ ప్రాంతాలను 'చివరి గ్రామాలు'గా పరిగణించి నిర్లక్ష్యం చేశారని, అయినప్పటికీ అక్కడ నివసించే ప్రజలు కాపాడుకుంటూ వస్తున్న చెక్కుచెదరని జాతీయ భావం, దేశభక్తి ప్రశంసనీయమని ప్రధాని పేర్కొన్నారు. అంతటి అత్యంత దుర్భర, వసతుల లేమి పరిస్థితుల్లో కూడా సరిహద్దు గ్రామాల ప్రజల్లో ఎన్నడూ సడలని దేశభక్తికి మనం ఎంతగానో గర్వపడాలి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ వ్యూహాత్మక విధానంలో వచ్చిన విప్లవాత్మక మార్పును వివరిస్తూ, సరిహద్దు నివాసాలను భారతదేశ 'చివరి' గ్రామాల నుంచి ఉదయ తొలి కిరణాలు, మువ్వన్నెల జెండా దేశానికి మొదటగా స్వాగతం పలికే 'తొలి గ్రామాలుగా' అధికారికంగా పునర్నామకరణం చేయడాన్ని ప్రధాని ప్రముఖంగా పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానంతరం ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంతాల్లో విద్యుత్, రహదారులు, తాగునీటి కుళాయిలు, గ్యాస్ కనెక్షన్లు, ఇంటర్నెట్ సదుపాయాలు వంటి అనేక చారిత్రక మౌలిక సదుపాయాల పురోగతిని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రాథమిక పట్టణ సదుపాయాలు సరిహద్దు వాసుల వ్యవసాయ రంగాన్ని, వారి దైనందిన జీవితాలను మౌలికంగా ఎలా మార్చివేస్తున్నాయో ఆయన వివరించారు. "నాటి చారిత్రక ఆలోచనా ధోరణిని మార్చడం వల్లనే ఈ రోజు మన సరిహద్దు ప్రాంతం వేగంగా మార్పు చెందుతోంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

కొత్తగా ఏర్పాటైన మౌలిక సదుపాయాల వల్ల లభించే అనేక ఆర్థిక ప్రయోజనాలను వివరిస్తూ, సరిహద్దు ప్రాంత పర్యాటకంలో వచ్చిన భారీ పునరుజ్జీవనాన్ని ప్రధాని ప్రముఖంగా పేర్కొన్నారు. ఒకప్పుడు నిర్మానుష్యంగా ఉన్న గ్రామాలు ఇప్పుడు నిరంతర కార్యకలాపాలతో కళకళలాడుతున్నాయని, ఇవి ఆడపిల్లల విద్యకు, స్థానికంగా ఆదాయం పెంపునకు అనువైన వాతావరణాన్ని కల్పిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ మార్పులన్నీ 'వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్' ద్వారా క్రమబద్ధంగా వేగవంతం అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. "?'వైబ్రెంట్ విలేజ్ ప్రోగ్రామ్ సరిహద్దు గ్రామాల సమగ్ర అభివృద్ధికి చురుగ్గా అద్భుతమైన కొత్త వేగాన్ని ఇస్తోంది" అని శ్రీ మోదీ పేర్కొన్నారు.

సరిహద్దు పర్యటనల భాగస్వామ్యం ద్వారా ఏర్పడే ఐక్యతను భావోద్వేగ ప్రయాణంగా అభివర్ణిస్తూ, తిరిగి వచ్చిన యువత కేవలం వారి ఆతిథ్యాన్ని మాత్రమే కాకుండా సాంస్కృతిక అవగాహనను, ఎంతో సంతృప్తిని, గొప్ప గౌరవాన్ని పొందిందని ప్రధాని గుర్తుచేశారు. ఇటువంటి అమూల్యమైన క్షేత్ర స్థాయి అనుభవాలు తరగతి గదిలో ఎప్పటికీ లభించవని స్పష్టం చేస్తూ, ఈ ప్రాంతాలను సందర్శించేలా తమ తోటి వారిని కూడా ప్రోత్సహించాలని ఆయన భాగస్వాములను కోరారు. ఇది క్రమంగా ఆయా ప్రాంతాలకు ఆధునిక వసతుల లభ్యతను వేగవంతం చేస్తుందని చెప్పారు. "?'భారతీయ యువత సరిహద్దు గ్రామాలను ఎంత లోతుగా అర్థం చేసుకుంటే, మన దేశం అంతగా బలోపేతం అవుతుంది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు."

సరిహద్దు పర్యాటకానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను మరింత ముందుకు తీసుకెళ్లాలని యువతకు పిలుపునిస్తూ, ప్రతి భాగస్వామి తమ అనుభవాలను కనీసం వంద మంది తోటివారితో పంచుకోవాలని కోరారు. ప్రాంతీయ సంస్కృతి, ఉత్పత్తులను ప్రోత్సహించడానికి స్థానిక కంటెంట్ క్రియేటర్లతో కలసి పనిచేయాలని, ప్రామాణికమైన ఇంటర్నెట్ కంటెంట్‌ను పంచుకోవాలని, భవిష్యత్తులో కుటుంబాలతో కూడా కలసి వెళ్లాలని, తమ తమ విద్యాసంస్థల ద్వారా విద్యా యాత్రలను ప్రోత్సహించాలని ప్రధాని సూచించారు. "మీలోని ప్రతి యువ మిత్రుడు మీ అనుభవాలను కనీసం మరో వంద మంది యువకులతో కచ్చితంగా పంచుకోవాలని నేను గట్టిగా కోరుతున్నాను" అని శ్రీ మోదీ అన్నారు

యువత సామర్థ్యంపై ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, 21వ శతాబ్దపు ప్రపంచ రూపురేఖలను తీర్చిదిద్దే అసలైన భవిష్యత్తు భారత యువత చేతుల్లోనే ఉందని ప్రధాని స్పష్టం చేశారు. యువతను పూర్తి వికసిత భారత్ చోదక శక్తిగానూ, అంతిమ లబ్ధిదారులుగానూ గుర్తిస్తూ, దేశ కీలక సవాళ్ల పరిష్కారాలతో వారు ప్రత్యక్షంగా మమేకం కావడం ద్వారా ఉజ్వలమైన జాతీయ భవిష్యత్తు సాధ్యమవుతుందని చెప్పారు. "?మన యువశక్తి దేశ సవాళ్లు, పరిష్కారాలతో నేరుగా అనుసంధానమైనప్పుడు, భవిష్యత్తు కచ్చితంగా, నిశ్చయంగా ప్రకాశవంతంగా .ఉంటుంది' అని శ్రీ మోదీ స్పష్టం చేశారు

# సర్పంచ్‌ను అరెస్టు చేయాలని కలెక్టరేట్ ఎదుట మత్స్యకారుల ధర్నా

నాగర్ కర్నూల్: దాడికి పాల్పడ్డ సర్పంచ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మత్స్యకారులు సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. గుడిపల్లి రిజర్వాయర్‌లో చేపలు పట్టుకునే విషయంలో గత కొంతకాలంగా నాగర్ కర్నూల్ మండలం గుడిపల్లి, నర్సాయిపల్లి, రేవల్లి మండలం గౌరీదేవి పల్లి గ్రామాలకు చెందిన మత్స్యకారుల మధ్య ఘర్షణ జరుగుతోంది. నర్సాయిపల్లి గ్రామంలో మత్స్యకారులు లేకపోయినా రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన మత్స్యకారులు కాని ఇతర కులాల వారికి సైతం చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ క్రమంలో ఆదివారం మాట్లాడుకునేందుకు రమ్మని నర్సాయిపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ రాములు, మిగతా గ్రామస్తులు గుడిపల్లి, గౌరీదేవి పల్లి గ్రామాలకు చెందిన మత్స్యకారులను పిలిపించి చర్చలు జరిపారు.

# సర్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి



నల్గొండ, జులై 27:కోదాడ పట్టణంలో కొనసాగుతున్న సర్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి సూచించారు. టీపీసీసీ డెలిగేట్ లక్ష్మారెడ్డితో కలిసి కార్యక్రమం పురోగతిని సమీక్షించిన ఆమె, సంబంధిత బృందాలు సమన్వయంతో పనిచేసి ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా వీర సైనికులకు ప్రధానమంత్రి కృతజ్ఞతాభివందనాలు

న్యూఢిల్లీ, జులై 27: కార్గిల్ విజయ దినోత్సవం నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు వీర సైనికులకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. దేశ భద్రత దిశగా కర్తవ్య నిర్వహణలో అసాధారణ ధైర్యసాహసాలు, అంకితభావం ప్రదర్శించిన వీరజవాన్లకు యావద్దేశం కృతజ్ఞతలు తెలుపుతున్నదని ఆయన పేర్కొన్నారు.

అత్యంత సంక్లిష్ట పరిస్థితుల నడుమ వారు ప్రదర్శించిన శౌర్యం జాతికి గర్వకారణంగా నిలుస్తుందన్నారు. వారి అంకితభావం, శభక్తి, కర్తవ్య పరాయణత తరతరాలకూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు.

"కార్గిల్ విజయ దినోత్సవం నేపథ్యంలో దేశ భద్రత పరిరక్షలనలో అసాధారణ ధైర్యసాహసాలు, అంకితభావం ప్రదర్శించిన వీర సైనికులకు యావద్దేశం కృతజ్ఞతలు తెలుపుతోంది. అత్యంత క్లిష్ట పరిస్థితులు, వాతావరణం మధ్య వారు ప్రదర్శించిన శౌర్యం జాతికి సదా గర్వకారణం. వారి అంకితభావం, దేశభక్తి, కర్తవ్య పరాయణత తరతరాలను ఉత్తేజితం చేస్తూనే ఉంటాయి."

# అమ్మే విశ్వ సృష్టికి మూలం

–నిరంజన్ రెడ్డి

## –అమ్మ త్యాగం, శ్రామిక జీవనాన్ని ప్రతిబింబించిన రచనగా ప్రశంసలు



మహబూబ్‌నగర్, జులై 27:విశ్వంలో సృష్టికి మూలం అమ్మేనని, అమ్మకు ప్రత్యామ్నాయం లేదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రముఖ కవి వనపట్ల సుబ్బయ్య రచించిన 'పసరంటిన కొడవలి' పుస్తకాన్ని ఆదివారం నాగం కర్నూల్ జిల్లా కేంద్రంలోని తిరమల ఫంక్షన్ హాల్‌లో నెలపొడుపు సాహిత్య–సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.

పుస్తకాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి, ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి నెలపొడుపు సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, విశ్వంలో సృష్టికి మించినది ఏదీ లేదని, ఆ సృష్టికి రూపం అమ్మేనని పేర్కొన్నారు. తల్లిపై తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, తల్లుల జీవన చరిత్ర, శ్రామిక బహుజన తత్వం, ఉత్పత్తి శక్తిగా వారి పాత్రను అక్షరరూపంలో ఆవిష్కరించిన వనపట్ల సుబ్బయ్యను అభినందించారు.

సమాజంలో మానవ సంబంధాలను పెంపొందించుకోవాలని, వివక్షలేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వనపట్ల సుబ్బయ్య ఇప్పటివరకు దాదాపు 15 కవితా సంపుటాలు వెలువరించారని, సమకాలీన పరిస్థితులపై నిరంతరం స్పందిస్తూ కవిత్వం రాస్తున్నారని కొనియాడారు. యువ కవులు ఆయన రచనల నుంచి స్ఫూర్తి పొందాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, తన చిన్ననాటి పేదరికాన్ని గుర్తు చేసుకుంటూ తల్లి ప్రేమ, త్యాగం జీవితంలో ఎంత గొప్పవో వివరించారు. ప్రస్తుత కాలంలో తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపుతున్న పరిస్థితుల్లో ఇటువంటి పుస్తకాలు సమాజంలో చైతన్యాన్ని తీసుకువస్తాయని అభిప్రాయపడ్డారు.

ప్రొఫెసర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ, 'పసరంటిన కొడవలి' పుస్తకం తల్లి జీవితాన్ని, శ్రామిక వర్గ మహిళల పాత్రను అద్భుతంగా ప్రతిబింబించిందన్నారు. తెలుగు సాహిత్యంలో తల్లిపై అనేక రచనలు వచ్చినప్పటికీ, అందరి తల్లుల జీవితాలను ఒకే సంకలనంగా కవిత్వీకరించడం వనపట్ల సుబ్బయ్యకే సాధ్యమైందని ప్రశంసించారు. పాలమూరు ప్రాంతీయ నుడికారాలు, జాతీయాలు, శ్రామిక జీవన చిహ్నమైన కొడవలిని శీర్షికగా ఎంచుకోవడం సముచితమన్నారు.

తెలంగాణ మహిళా అధ్యయన వేదిక అధ్యక్షురాలు కొల్లాపురం విమల మాట్లాడుతూ, నేటి యువత సమస్యల పరిష్కారానికి వెనుకాడని తరం అని పేర్కొన్నారు. అలాంటి తరాన్ని తీర్చిదిద్దిన తల్లులకు వందనాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కందికొండ మోహన్, వనపట్ల సర్పంచ్ వాసుదేవుడు, కొట్ల నిరంజన్ రెడ్డి, కొండకింది మన్యప్ రెడ్డి, కవులు తగుళ్ల గోపాల్, ఎదిరెపల్లి కాశన్న, గుడిపల్లి నిరంజన్, కల్వకోల్ మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, వెంకట్ పవార్, ఖాజా, యోగానందం, గౌస్ పాషా, దేవదానం, పలుస శంకర్ గౌడ్, బైరోజు సోదరులు, నీరటి బాలీశ్వర్, దేవరపాగ కృష్ణయ్య, రాజేష్‌తో పాటు పలువురు కవులు, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో 'ఎఫ్‌సీవీ' పొగాకు మార్కెట్ పరిస్థితిపై కేంద్ర వాణిజ్య శాఖ సమీక్ష

న్యూఢిల్లీ, జులై 27: ఆంధ్రప్రదేశ్‌లో బ్యారన్లలో శుద్ధి చేసిన (ఫ్లూ-క్యూర్డ్) వర్జీనియా (ఎఫ్‌సీవీ) పొగాకు పంటపై ప్రస్తుత మార్కెట్ పరిస్థితిపై వాణిజ్య శాఖ బృందం ఇటీవల సమీక్షించింది. ఈ మేరకు ఈ నెల 25న ఆ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ నితిన్ కుమార్ యాదవ్ నేతృత్వాన ఒక బృందం రాష్ట్రంలో పర్యటించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎన్.చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పొగాకు బోర్డు చైర్మన్–ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కూడా పాల్గొన్నారు. 'ఎఫ్‌సీవీ' పొగాకు సాగు చేసే రైతుల ప్రయోజనాల పరిరక్షణ, ఈ రంగంలో స్థిరత్వం దిశగా దీర్ఘకాలిక చర్యలు తీసుకోవడంపై ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు.

ఈ పర్యటనలో భాగంగా వెల్లంపల్లిలోని పొగాకు బోర్డు వేలం కేంద్రాన్ని కేంద్ర బృందం సందర్శించి, అక్కడి కార్యకలాపాలను, వేలం ప్రక్రియను పరిశీలించింది. దీంతోపాటు ప్రస్తుత మార్కెట్ పరిస్థితులపై ప్రత్యక్ష సమాచార సేకరణ నిమిత్తం అధికారులు రైతుల తోనూ విస్తృతంగా సంభాషించారు. పారదర్శకంగా, క్రమబద్ధంగా వేలం నిర్వహిస్తున్న తీరుపై పొగాకు బోర్డును ఈ బృందం అభినందించింది. మార్కెట్ పరిణామాలను కేంద్ర ప్రభుత్వం నిశితంగా పర్యవేక్షిస్తోందని అదనపు కార్యదర్శి శ్రీ నితిన్ కుమార్ యాదవ్ ఈ సందర్భంగా రైతులకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, పొగాకు బోర్డు, ఇతర సంబంధిత వర్గాల సమన్వయంతో ఎఫ్‌సీవీ పొగాకు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు.

# జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



నల్గొండ, జులై 27: రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ప్రోగ్రెసివ్ జర్నలిస్ట్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏనుగుల వీరాంజనేయులు కోరారు. నడిగూడెం మండల కేంద్రంలో నిర్వహించిన నూతన ప్రెస్ క్లబ్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాల విధానాల వల్ల జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దేశంలో జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో వారికి చట్టపరమైన రక్షణ కల్పించాలని, కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన రైల్వే పాసులను పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు అన్ని సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమానికి మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దున్న శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్ట్ ఎస్.ఎన్. మూర్తితో పాటు కమిటీ సభ్యులను జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఘనంగా సన్మానించారు.

# డా॥ ఏపీజే అబ్దుల్ కలాంకు వైఎస్సార్సీపీ నేతల ఘన నివాళి



అమరావతి, జులై 27:అవనిగడ్డ వైసీపీ కార్యాలయంలో భారత రత్న మాజీ రాష్ట్రపతి డా. ఏ.పి.జె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా దేశానికి ఆ మహానీయుడు అందించిన సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

ఈ కార్యక్ర మంలో కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు సింహాద్రి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేపల్లె శ్రీనివాసరావు, కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీల విభాగం అధ్యక్షులు మద్ది వెంకటనారాయణ(చిన్న), అవనిగడ్డ కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాషా, యడ్లంక మాజీ సర్పంచ్ సైకం బాబురావు, కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం కార్యదర్శి సామర్ల రాముడు, అవనిగడ్డ గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ ఖాదర్ వలీ, మొఘల్ హుస్సేన్, షేక్ రియాజ్ భాష మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# నిత్య అన్నదాన సేవకు అనుముల కుటుంబం చేయూత

## –శ్రీ ఉమామహేశ్వర స్వామి నిత్య అన్నదానానికి రూ.25,116 విరాళం

మహబూబ్‌నగర్, జులై 27:శ్రీశైలం ఉత్తర ద్వారంగా ప్రసిద్ధి చెందిన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం రంగాపురం గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో కొనసాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి అనుముల కుటుంబం రూ.25,116 విరాళంగా అందజేసింది.

అనుముల విష్ణేశ్వర రెడ్డి, మహాలక్ష్మి పేరున వారి తల్లిదండ్రులు అనుముల రాజావర్ధన్ రెడ్డి, సునీతమ్మ దంపతులు ఆలయాన్ని సందర్శించి, నిత్య అన్నదాన కార్యక్రమానికి రూ.25,116 విరాళాన్ని ఆలయ పాలక మండలి చైర్మన్ బీరం మాధవ రెడ్డికి అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన అనుముల కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. రోజురోజుకూ దేవస్థానం అభివృద్ధి చెందుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్తలు దాశరథి పవన్, గండికోట దశరథం, ఆలయ అర్చకులు, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు క్రీడల్లో రాణించి దివిసీమకు పేరు తేవాలి

## –అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష

అమరావతి, జులై 27:విద్యార్థులు క్రీడల్లో రాణించి దివిసీమకు మంచిపేరు తేవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆకాంక్ష వ్యక్తం చేశారు. సోమవారం అవనిగడలోని ఇండోర్ స్టేడియంలో అమరావతి ఛాంపియన్ షిప్–2026 నియోజకవర్గ జట్ల ఎంపికను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు విశేష ప్రోత్సాహం అందిస్తోందన్నారు. విద్యార్థులు తమకు ఆసక్తి కలిగిన క్రీడలో నైపుణ్యం పెంచుకుని ఎదగాలని పిలుపునిచ్చారు.

మూడు రోజులపాటు జరిగే ఎంపిక ప్రక్రియను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ షటిల్ కోర్టు ఓపెన్ చేసి, షటిల్ ఆడి ప్రారంభించారు. సెలక్షన్లకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు.

అనంతరం ఆర్చరీ, అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను వ్యాయామ ఉపాధ్యాయులు చేపట్టారు. కార్యక్రమంలో ఎంఈఓలు అన్నపరెడ్డి పిచ్చయ్య, సనకా శ్రీకాంత్, అసోసియేషన్ అధ్యక్షులు బడే వెంకటేశ్వరరావు, కార్యదర్శి బీపీఎల్ ప్రసాద్, కోశాధికారి నవీన్, గరికపాటి మారుతీ, అప్పికట్ల రామారావు, తాతాజీ, మునగాల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# వడాలిలో టీడీపీ డోర్-టు-డోర్ కార్యక్రమానికి శ్రీకారం..

## –నాయకులకు వీరమల్లు నరసింహారావు దిశానిర్దేశం



అమరావతి, జులై 27: ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో టీడీపీ డోర్–టు–డోర్ కార్యక్రమాన్ని కైకలూరు నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు ప్రారంభించారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. అలాగే పార్టీ సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని డోర్–టు–డోర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంకల్పించారు.

# ఐఐటీ ఖరగ్‌పూర్‌లో పెరిగిన ఎంటెక్ సీట్లు

న్యూఢిల్లీ, జులై 27: ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని ఎంటెక్ కోర్సుల్లో 2026–27కు సీట్లను పెంచింది. ఈ సీట్లను 'ప్లాటినం జూబ్లీ పథకం'లో భాగంగా పెంచినట్లు కాలేజీ యాజమాన్యం 'ఎక్స్'లో వెల్లడించింది. దీంతో ఎంట్రన్స్ పరీక్ష గేట్‌లో అర్హత సాధించిన అనేక మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ 75వ స్నాతకోత్సవ జూబ్లీ వేడుకలను జరుపుకొంటుంది. ఈ సందర్భంగా ప్లాటినం జూబ్లీ పథకాన్ని ప్రారంభించింది. నైపుణ్యం కలిగిన విద్యార్థులకు అవకాశం కల్పించేందుకు సీట్లు పెంచామని తెలిపింది. ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ రంగాలకు చెందిన విభాగాల్లో ఈ సీట్లను పెంచారు.

ఈ అదనపు సీట్లకు సాధారణ ఎంటెక్ ప్రవేశాల మాదిరిగానే తీసుకుంటారు. వ్యాలిడ్ కలిగిన గేట్ స్కోర్ ఉన్న వీటికి దరఖాస్తు చేసుకోవాలి. అలాగే ఏదైనా ఐఐటీ నుంచి గ్రాడ్యుయేషన్‌లో 8 లేదా అంతకంటే సీజీపీఏ సాధించినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఐఐటీ ఖరగ్‌పూర్ కంప్యూటర్ సైన్స్ అండ్ డేటా ప్రాసెసింగ్, సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ మెకానిక్ లెర్నింగ్, కంట్రోల్ సిస్టమ్స్ ఇంజినీరింగ్, బయోటెక్నాలజీ అండ్ బయోకెమికల్ ఇంజినీరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీ, క్రయోజెనిక్ ఇంజినీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఇంటిగ్రేటెడ్ ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఎర్త్ సిస్టమ్ సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర కోర్సులను ఎంటెక్‌లో అందిస్తుంది.

కాలేజీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల గేట్ అర్హత సాధించి ఐఐటీలో ఎంటెక్ చేయాలనుకునే ఎక్కువ మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. అడ్మిషన్ల సమాచారం కోసం కాలేజీ అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు చూస్తూ ఉండాలి.

# పద్మశాలి సంఘం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.. కేటీఆర్ హామీ



రాజన్న సిరిసిల్ల, జూలై 27: పద్మశాలి సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. సంఘం అభివృద్ధికి అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తానని పద్మశాలి సంఘ ప్రతినిధులకు భరోసా కల్పించారు.

సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సిరిసిల్ల పద్మశాలి సంఘం సభ్యులు, నాయకులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు మార్కండేయ చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. అనంతరం పద్మశాలి సంఘానికి సంబంధించిన సమస్యలు, అభివృద్ధి అంశాలు, ఇతర ప్రజా సమస్యలను సంఘం నాయకులు కేటీఆర్‌కు వివరించారు. దీనికి కేటీఆర్ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కేటీఆర్ సానుకూల స్పందనపై పద్మశాలి సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, సిరిసిల్ల పద్మశాలి సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, మండల సత్యం, గాజుల బాలయ్య, గెంట్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలకు తక్షణ పరిష్కారం చూపండి..

## సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిక




అమరావతి, జులై 27: విజయవాడ నగరంలో తాగునీరు, పారిశుద్ధ్యం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాల కేటాయింపు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, నిలిచిపోయిన అభివృద్ధి పనులు తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆదివారం వీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తాగునీటి కొరత, పారిశుద్ధ్య లోపాలతో డయేరియా కేసులు పెరుగుతున్నాయని, చిన్నపాటి వర్షానికే రహదారులు జలమయమవుతున్నాయని, గతంలో మంజూరైన వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు పూర్తి కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు.

మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాలను అర్హులైన పేదలకు కాకుండా ఇతరులకు కేటాయిస్తున్నారని విమర్శించారు. కమ్యూనిటీ హాళ్లు పూర్తి కాక అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ పూర్తిగా దెబ్బతిన్నదని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడుతూ, నగరాభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, కార్పొరేషన్ అధికారులు అధికార పార్టీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

వర్షాకాలంలో కొండ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పార్కులు నిర్లక్ష్యానికి గురయ్యాయని, భవనాల అనుమతుల పేరుతో భారీగా వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో సిద్ధం చేసిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం గృహాలను అర్హులైన పేదలకు పంపిణీ చేయకుండా రాజకీయ ప్రాతిపదికన కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే కేటాయించిన ఇళ్లను సమీక్షించి అర్హులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణలు, అక్రమ లేఔట్లపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

పేదలకు ఇళ్ల పంపిణీ జరగకపోతే కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, తమ పాలనలో పేదలకు గృహాలు అందించామని, ప్రస్తుతం ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపించారు. కార్పొరేషన్ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లిస్తోందని, రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సేవలు నిర్లక్ష్యానికి గురయ్యాయని విమర్శించారు. వినతిపత్రంలో ప్రస్తావించిన అంశాలపై అధికారులు తక్షణ చర్యలు తీసుకుని నగర సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు.

# ధర్మసాగర్ కాలువ ద్వారా సాగునీటి విడుదల..

## -రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండ: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



వరంగల్, జులై 26:రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ధర్మసాగర్ రిజర్వాయర్ సౌత్ కెనాల్ నుంచి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సాగునీటిని విడుదల చేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ఆదుకునేందుకు గోదావరి జలాలకు పసుపు, కుంకుమ, పుష్పాలతో స్వాగతం పలికి కాలువ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. హసన్‌పర్తి, ఐనవోలు, వర్ధన్నపేట మండలాల పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని తెలిపారు.

కాలువ ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, వర్షాలు సమృద్ధిగా కురిస్తే రైతులకు నిరంతరం నీటి సరఫరా కొనసాగుతుందని కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ జడ్పీటీసీ బానోత్ సింగులాల్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఇష్టంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్తు: వెరబెల్లి రఘునాథరావు

ఆదిలాబాద్, జులై 27:విద్యార్థులు చదువును భారంగా భావించకుండా, సబ్జెక్టుపై ఆసక్తి పెంచుకొని ఇష్టంతో చదివితేనే అద్భుతమైన ఫలితాలు సాధించి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవచ్చని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెరబెల్లి రఘునాథరావు అన్నారు. సోమవారం దండెపల్లి మండలంలోని వెల్గనూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం వెరబెల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉచితంగా స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్స్, కంపాస్ బాక్సులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదో తరగతి విద్యార్థుల జీవితంలో కీలకమైన మైలురాయి అని పేర్కొన్నారు. ఇప్పటి నుంచే పట్టుదలతో చదివి అత్యుత్తమ మార్కులు సాధిస్తే భవిష్యత్తులో లక్ష్యాలను చేరుకోవడం సులభమవుతుందని చెప్పారు. కష్టపడి చదవడం కంటే ఇష్టపడి చదివితే ఏ గమ్యాన్నైనా చేరుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి రాజన్న, బీజేపీ నాయకులు మొరుపుటాల తులసి, గోపతి రాజయ్య, బండే రవి గౌడ్, బెడద సురేష్, శేఖర్, పత్తిపాక సంతోష్, గడికొప్పుల సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుతో అధిక దిగుబడి సాధించాలి



ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో అధిక దిగుబడినిచ్చే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉల్లోజు వినోద్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి (పశు సంవర్ధక శాఖ జేడీ) రమేష్‌కుమార్ సూచించారు. సోమవారం నల్లగొండ మండలం వెలుగుపల్లి రైతు వేదికలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యామ్నాయ పంటల విత్తన మేళాను ప్రారంభించారు. భూగర్భ జలాలు తగ్గుతున్న నేపథ్యంలో కంది, పెసర, మినుము, ఆముదం, కూరగాయల వంటి ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

మూడు రోజులపాటు నిర్వహించే విత్తన మేళాలో నాణ్యమైన కంది, పెసర, మినుము, ఆముదం, వివిధ కూరగాయల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అవసరమైన విత్తనాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుంకోజు శ్రీనివాస్, ఎంపీడీవో యాకూబ్ నాయక్, ఉద్యానవన శాఖ అధికారి అనంతరెడ్డి, సర్పంచులు, ఏఈవోలు, రైతులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతులు మెట్ట పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలి.. కోరుట్ల ఏవో నాగమణి

కరీంనగర్, జులై 27:తక్కువ నీటితో సాగుచేసే మెట్ట పంటల సాగుకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలని కోరుట్ల మండల వ్యవసాయ అధికారిణి నాగమణి పేర్కొన్నారు. కోరుట్ల మండలంలోని ఐలాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్ నినో వర్ష భావ పరిస్థితులలో మెట్ట పంటల సాగుపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవని నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటలను ప్రాధాన్యంగా సాగు చేయాలని తెలిపారు.

పెసలు, మినుములు, కందులు, సోయాబీన్, వేరుశనగ, జొన్న, పొద్దు తిరుగుడు వంటి పంటలు తక్కువ నీటితో మెరుగైన దిగుబడిని అందిస్తాయని పేర్కొన్నారు. వీటి సాగుతో పెట్టుబడి భారం తగ్గడంతో పాటు రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఆమె వివరించారు. ఐలాపూర్ రైతు వేదిక లో 3 రోజుల పాటు విత్తనా మేళా ఏర్పాటు చేశామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చీడ పీడల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడి మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు అంజిరెడ్డి గ్రామ సర్పంచ్ రామకృష్ణ, ఏఈవో శ్రీహరి, ఫామీన, అనిల్, నవిత, రైతులు పాల్గొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

అమరావతి, జులై 27:ఏపీలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదం ( ఖీనీజీట ంఇఇతిటవనిబి ) లో ముగ్గురు మృతి చెందగా మరికొందరికి గాయాలయ్యాయి . చిత్తూరు( అప్త్రతిబిబినీనీతీ ) జిల్లా శాంతిపురం మండలం కడపల్లి వద్ద జాతీయ రహదారి వద్ద కుప్పం-పలమనేరు మార్గంలో తాగునీటి ట్యాంకర్‌ను , ద్విచక్రవాహనాన్ని టెంపో వాహనం ఢీ కొట్టింది.

ఈ ప్రమాదంతో ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి . బైక్‌పై వెళ్తున్న సుందరప్ప (60), ముని వెంకటమ్మ ( 50 ) మృతి చెందగా ట్యాంకర్ వద్ద నిలబడి ఉన్న నాలుగేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. గాయపడ్డ క్షతగాత్రులను స్థానికులు కుప్పం ఆసుపత్రికి తరలించారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి.. కలెక్టర్ ఆదేశాలు

కరీంనగర్, జులై 27: సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టేలా వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఖరీఫ్ సాగు పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, ఫార్మ్ పాండ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున ఈ ఖరీఫ్‌లో వరి సాగుకు బదులుగా కందులు, పెసలు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేయాలని రైతులను ప్రోత్సహించాలని సూచించారు. రాబోయే పది రోజులను ప్రత్యేక కార్యాచరణగా తీసుకుని గ్రామాల వారీగా రైతులను పంట మార్పిడికి ప్రోత్సహించాలని, ప్రతిరోజూ పురోగతి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఒంటరి మహిళా రైతులు, చిన్న, సన్నకారు రైతులకు అదనపు ప్రోత్సాహం అందిస్తామని, ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 2.91 లక్షల ఎకరాల సాగు లక్ష్యాన్ని తప్పనిసరిగా సాధించాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రసాద్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గద్వాల జిల్లాలో లారీని ఢీకొట్టిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు.. తప్పిన పెను ప్రమాదం

జోగులాంబ గద్వాల, జులై 27: జిల్లాలో సోమవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.

ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు స్టేజీ సమీపంలోని ఘర్ దాబా వద్ద ఓ లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది.

ప్రమాదానికి కారణమైన బస్సును ఇంటర్‌సిటీ స్మార్ట్ బస్సుగా గుర్తించారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద తీవ్రత ఎక్కువగానే ఉన్నప్పటికీ.. బస్సులో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

# కలాం జీవితం ప్రతి విద్యార్థికి స్ఫూర్తి..

అమరావతి, జులై 27:మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ఆయన కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణానికి ప్రతి భారతీయుడు కృషి చేయాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి పిలుపునిచ్చారు. అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సోమవారం గుంటూరు పట్టాభిపురంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ.. పేపర్ బాయ్‌గా జీవితం ప్రారంభించి దేశ అత్యున్నత పదవైన రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాం ప్రయాణం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. మేధస్సు, ప్రతిభ ఉంటే పేదరికం విజయానికి ఎప్పుడూ అడ్డుకాదని తన జీవితంతోనే నిరూపించిన మహనీయుడు కలాం అని కొనియాడారు.

దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసిన అగ్ని, పృథ్వి క్షిపణుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించి "మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా"గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని తెలిపారు. విద్యార్థులంటే అమితమైన ప్రేమ కలిగిన కలాం తన జీవితకాలంలో లక్షలాది మంది యువతతో మమేకమై, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ప్రేరణ ఇచ్చారని గుర్తు చేశారు.

అవినీతి రహిత, విద్యా, సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా నిలిచే అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించడమే అబ్దుల్ కలాంకు అందించే నిజమైన నివాళి అని ఆళ్ళ హరి పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నగర కార్యదర్శి షేక్ మెహబూబ్ భాషా, కోలా అంజి, నందూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి'

## -మిర్యాలగూడ ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి



నల్గొండ, జులై 27:మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ స్థాయి పరిధిలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి అన్నారు. సోమవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో డివిజన్ పరిధిలోని వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులను స్వీకరించి మాట్లాడారు. డివిజన్ స్థాయి పరిధిలో ఏ శాఖ పరిధి లోనైనా సమస్య ఉన్నట్లయితే ప్రజావాణి ద్వారా తమ వినతి పత్రాన్ని అందజేయాలని, ఆయా సమస్యలను సంబంధిత శాఖ ద్వారా సత్వర పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం 12 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వివరించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ పరిధిలో 3, పెద్దవూర తాసీల్దార్ కార్యాలయం ఒకటి, మాడుగులపల్లి తాసీల్దార్ కార్యాలయం ఒకటి, తాసీల్దార్ కార్యాలయం నిడమనూరు 1, త్రిపురారం తాసీల్దార్ కార్యాలయం రెండు, వేములపల్లి తాసీల్దార్ కార్యాలయం ఒకటి, దామరచర్ల తాసీల్దార్ కార్యాలయం ఒకటి, మిర్యాలగూడ మున్సిపాలిటీ 1, మిర్యాలగూడ ఆర్ అండ్ బి, డిఈఈ కార్యాలయానికి ఒకటి ఫిర్యాదులు అందజేశారని ఆర్డీఓ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి-ఏఐయుకేఎస్ డిమాండ్



ఖమ్మం, జులై 27:వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని ఏఐయుకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆగస్టు 3 నుండి 10వ తేదీ వరకు మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో రైతు ఆందోళనలు జరపాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆన్‌లైన్ సమావేశం బుర్ర వెంకన్నఅధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో కెచ్చెల రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా విత్తనాలు ఎండిపోవడం, మొలకెత్తినా పంటలు వాడిపోవడం జరిగిందన్నారు. కావునా నష్టపడ్డ రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా స్వల్పకాలిక పంట విత్తనాలు, ఎరువులు ఉచితంగా అందించాలన్నారు.

రైతుల పాత రుణాలు పూర్తిగా ఒకేసారి మాఫీ చేయాలని, కొత్తగా వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలన్నారు. అలాగే పంటల బీమా అమలు చేయాలని, పశుగ్రాసం, మంచినీటి సరఫరా గ్రామాలకు సమకూర్చాలని కోరారు. పోడు సాగుకు అటవీ అధికారులు సృష్టిస్తున్న ఆటంకాలు తొలగించాలని, పట్టా పోడు భూముల్లో ట్రాక్టర్లు వాడరాదనే ఆంక్షలు ఎత్తేయాలన్నారు. దుర్భిక్ష పరిస్థితుల్లో పనిలేని రైతు, కూలీలకు ఉపాధి హామీ చట్టం ద్వారా పనులు కల్పించి రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై ఆగస్టు 3 నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలు జరపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము, కల్లూరి కిషోర్, బానోత్ ధర్మ పాల్గొన్నారు.

# 150 ఏళ్ల నాటి కరువు పరిస్థితి..

## -తక్కువ నీటితో సాగయ్యే పంటలే మేలు: మంత్రి తుమ్మల



హైదరాబాద్, జులై 27: ప్రపంచంపై ప్రకృతి చాలా తీవ్రంగా దాడి చేసిందని, 150 సంవత్సరాల్లో లేని కరువు పరిస్థితి కనిపిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరరైన ఆయన మాట్లాడారు. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో మనదేశానికి వచ్చే నైరుతి రుతుపవనాల జాడ లేకుండా పోయిందని, దీంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయని చెప్పారు. దీంతో రానున్న మార్చి, ఏప్రిల్ నెలల దాకా దుర్భిక్ష ప్రభావం ఉండవచ్చునన్నారు. తెలంగాణలో సరైన వర్షాలు కురవవని ఐఎండీ, ప్రపంచ వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. వచ్చే నెలలో అంతంత మాత్రంగా కురిసే వర్షాలు మెట్ట పంటలకు ఉపయోగపడవచ్చునన్నారు. వరి సాగుకు చాలా కష్టతరంగా ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తక్కువ కాలంలో తక్కువ సాగునీటితో చేతికొచ్చే పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలను సాగుచేసుకోవాలని రైతులకు ఆయన సూచించారు. కాగా, రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలను మరింత సమర్థంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు నాణ్యమైన ?సవలు అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలని ఒక ప్రకటలో సూచించారు. మార్కెట్ కమిటీల పనితీరును సమగ్రంగా పరిశీలించేందుకు ఆరు ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు వారం రోజులపాటు తనిఖీ చేస్తాయని పేర్కొన్నారు.

27 నుంచి రైతు వేదికల్లో విత్తన మేళా

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29 వరకు రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి తెలిపారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటుచేసి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు.

# కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ



కరీంనగర్, జులై 27: కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ ఎన్నికకు నగరంలోని పద్మనగర్ లో గల యూనియన్ కార్యాలయంలో సోమవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి మహమ్మద్ జలాలోద్దీన్ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు.

ఈ నెల 29 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. 30 న నామినేషన్ల పరిశీలన, 31న నామినేషన్ల ఉప సంహరణ, ఆగస్టు 5న రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు. జిల్లాలో 16 మండలాల్లోని 139 ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల అధ్యక్షులు ఈ ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

# జీవకోటి రక్షణకు ప్రకృతి పరిరక్షణే మార్గం



ప్రకృతి అనేది మానవ జీవనానికి మూలాధారం. జీవానికి అవసరమైన గాలి, నీరు, ఆహారం, నివాసం, ఔషధం, జీవవైవిధ్యం అన్నీ ప్రకృతికి మనం ఋణపడి ఉన్న అంశాలే. భారతీయ సంస్కృతిలో ప్రకృతిని తల్లిగా భావించి ఆరాధించడం పరంపరగా కొనసాగుతోంది. అయితే ఆధునిక యుగంలో మానవుడు అభివృద్ధి పేరిట ఆ తల్లినే గాయ పరుస్తున్నాడు. అరణ్యాల తొలగింపు, నదుల కాలుష్యం, వాయు మాలిన్యం, వన్యప్రాణుల ఉనికికి ముప్పు, జీవ జాతుల అంతరించటం వంటి ప్రకృతి విధ్వంసక చర్యలు భూమిని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి సంవత్సరం జూలై 28న నిర్వహించబడే ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం మానవ సమాజాన్ని మేల్కొలిపే ఆవశ్యకతగా మారింది.

ఈ దినోత్సవం ప్రకృతికి గౌరవం చెల్లించడమే కాదు, భావితరాల కోసం సహజ వనరులను సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తు చేస్తుంది. ప్రకృతి పరిరక్షణ అంటే కేవలం పచ్చదనం కాదని, అది వర్షాలు, పర్వతాలు, నేల, సముద్రాలు, గాలి, వాటిలో నివసించే జీవ సముదాయం అంతా కలసి ఒక సమగ్ర జీవవ్యవస్థ అని తెలుసుకోవాలి. ఈ వ్యవస్థను ధ్వంసం చేయడం మానవుని భవిష్యత్తును అంధకారంలో నెట్టే చర్య.

ప్రపంచవ్యాప్తంగా ప్రకృతి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఐక్యరాజ్యసమితి, యునెస్కో, జఔఇఖ, చిచిఈ నివేదికల ప్రకారం గత శతాబ్దంలో ప్రపంచ అడవుల విస్తీర్ణం సుమారు 30 శాతం తగ్గింది. ప్రతీ ఏడాది 13 మిలియన్ హెక్టార్ల అటవీ భూమి మాయమవుతోంది. పచ్చదనం తగ్గడంతో భూమి మీద హరిత కవరేజ్ తగ్గిపోతుంది. పర్యావరణ సమతుల్యత కోసం అవసరమైన వృక్షజాలం ధ్వంసమవుతోంది. గ్లోబల్ వార్మింగ్, వాయు కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు, సముద్ర కాలుష్యం పెరుగు తున్నాయి. వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. వర్షపాతం అసమానంగా మారడం, అధిక ఉష్ణోగ్రతలు, హిమనదుల కరుగుదల వంటి పరిణామాలు మానవాళికి హెచ్చరికలుగా మారుతున్నాయి.

భారతదేశ పరిస్థితి కూడా ఆశాజనకంగా లేదు. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ 2024 నివేదిక ప్రకారం ఒక్క ఏడాదిలోనే 1.6 లక్షల హెక్టార్ల అటవీ భూమి విపత్తులకు గురైంది. గంగానది కాలుష్య స్థాయిలో ప్రపంచంలో అత్యంత కలుషిత నదుల జాబితాలో కొనసాగుతోంది. ఢిల్లీ, కోల్‌కతా, ముంబయి వంటి మహానగరాల్లో గాలి నాణ్యత సూచిక ప్రమాదకరంగా ఉంది. తాగునీటి సమస్య, వర్షాల లోపం, నేలపరాగ నష్టాలు తీవ్రంగా విజృంభిస్తున్నాయి. వన్యప్రాణుల ఆవాసాలను ఆక్రమణ, తవ్వకాలు ధ్వంసం చేస్తున్నాయి. ఇది భావితరాల జీవన హక్కుపై స్పష్టమైన దాడి.

ఈ సంక్షోభంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల భాగస్వామ్యం అత్యవసరం. జలశక్తి అభియాన్, అంఒఖం, గ్రీన్ ఇండియా మిషన్, నేషనల్ క్లైమేట్ యాక్షన్ ప్లాన్, లైఫ్ (ఒతిఈఇ ? ఒతిటవ బబిఎశ్రీవ టనీతీ ఇనిలతితీనీనిఎవనిబి) వంటి పథకాలు ప్రజల సహకారంతోనే సఫలమవుతాయి. ప్రకృతి పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు. ప్రతి వ్యక్తి బాధ్యతగా తీసుకోవాల్సిన తాత్విక, నైతిక, సామాజిక కర్తవ్యంగా ఇది మారాలి.

ప్రతి ఒక్కరూ చిన్న చిన్న చర్యల ద్వారా ప్రకృతిని కాపాడే సాధ్యమైన మార్గాలను పాటించాలి. మొక్కలు నాటి వాటిని సంరక్షించడం, అవసరమైనప్పుడు మాత్రమే విద్యుత్ వినియోగించడం, నీటి వృథా నివారించడం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పునర్వినియోగ పదార్థాలు ఉపయోగించడం, పర్యావరణ బోధన విద్యార్థులకి అందించడం, స్థానిక స్థాయిలో వన్యజీవ సంరక్షణ ఉద్యమాలలో పాల్గొనడం వంటి సాధారణ చర్యలు సమష్టిగా మారితే విప్లవాత్మక ఫలితాల దారి చూపగలవు.

మన భారతీయ సంస్కృతి ప్రకృతిని దేవతలుగా భావించిన అనాదిగా అరణ్యాలకు అర్చనలు, నదులకు పూజలు, పర్వతాలకు నమస్కారాలు అన్నీ మన జీవన విధానంలో భాగంగా కొనసాగాయి. ప్రకృతికి అనుకూలంగా జీవించడమే నిజమైన పూజ. ఆధునిక శాస్త్రజ్ఞానం ప్రకృతిపై ఆధారపడే మానవ మనుగడను నిరూపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం ఒక నినాదం కాదు, జీవన విధానంగా మారాలి.

ఈ దినోత్సవం ప్రతి ఒక్కరికీ మేల్కొలుపు సందేశంగా ఉండాలి. విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు ప్రకృతి విషయంలో బాధ్యతా యుతంగా ప్రవర్తించాలి. విద్యా సంస్థలు పర్యావరణ అవగాహనకు వేదికలుగా మారాలి. కార్పొరేట్ సంస్థలు పచ్చదనం పెంపుకు తమ సామాజిక బాధ్యతగా ముందుకు రావాలి. మీడియా, సాహిత్యం, కళలు ప్రకృతిని ప్రేమించే శక్తిని సమాజంలో వ్యాపింప జేయాలి. సంస్కృతిగా, శాస్త్రంగా, విధిగా ప్రకృతి పరిరక్షణను నమ్మకం, కృషిగా మార్చుకోవాలి.

ఇప్పటికే మనం మించిన నష్టాన్ని ప్రకృతికి కలిగించాం. ఇకనైనా ఆగాలి. మనం చేసే ప్రతి చిన్న చర్య భావితరాలకు భద్రమైన భూమిని అందించే దిశగా ఉండాలి. భూమి మనది. బాధ్యత మనది. భవిష్యత్తు మన చేతిలో ఉంది. ఇంకో భూమి మనకు లేదు. ఇదే మన జీవనాధారం. ప్రకృతిని కాపాడడం అనేది మనకు ప్రత్యామ్నాయము లేని అవసరం. ఇప్పుడు మేల్కొంటే రేపు మనకు భద్రత ఉంటుంది. ఈ దినోత్సవం ద్వారా మానవతా బోధనతో కూడిన ప్రకృతి పరిరక్షణ చైతన్యాన్ని ఏర్పరచుకుందాం.

జూలై 28... ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# పొరపాట్లకు తావులేకుండా ఎస్ఐఆర్ పూర్తి చేయాలి: ప్రభుత్వ విప్ విజయ రమణారావు



కరీంనగర్, జులై 27:ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ముందు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన 39 అజెండా అంశాలను చర్చించి కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు.

సమావేశం అనంతరం కౌన్సిలర్లు, వార్డు అధికారులు, బీఎల్‌వోలు, మెప్మా రిసోర్స్ పర్సన్లతో ఎస్ఐఆర్ కార్యక్రమంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని 36 వార్డుల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణను సమన్వయంతో పూర్తి చేయాలని, అవసరమైతే ప్రతి వార్డులో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ప్రజల దరఖాస్తులను సకాలంలో పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వైస్ చైర్‌పర్సన్ ముస్కాన్ నాజ్ నయ్యర్ అలీ, టౌన్ ప్లానింగ్ అధికారులు, కౌన్సిలర్లు, వార్డు అధికారులు, బీఎల్‌వోలు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారు: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జులై 27: దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు కంపెనీ సింగరేణి అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. సింగరేణి నుంచి కర్ణాటక, ఏపీ, మహారాష్ట్ర, ఎన్‌టీపీసీ కి బొగ్గు సరఫరా అవుతుందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణికి తీవ్ర నష్ట చేకూర్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా సింగరేణి మెరుగుపడడం లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం 49 శాతం, తెలంగాణ ప్రభుత్వం 51 శాతం వాటాతో సింగరేణి కొనసాగుతోందని కేంద్ర మంత్రి తెలిపారు.

మాజీ సీఎం కేసీఆర్.. సింగరేణికి తీరని ద్రోహం చేశారని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి ఆదాయానికి గత ప్రభుత్వం గండికొట్టిందని ఆరోపించారు. రాజకీయ వేదికలకు సింగరేణిని వాడుకున్నారంటూ బీఆర్ఎస్, కేసీఆర్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# యాదాద్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**-భక్తుల సౌకర్యాల విస్తరణ, పాలక మండలి కార్యాలయ వినియోగంపై సమీక్ష**
**-పునర్నిర్మాణం, ఆధునీకరణకు కార్యాచరణ రూపొందించాలని ఆర్కిటెక్ట్‌లకు సూచనలు**

యాదగిరిగుట్ట, జులై 27: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి చైర్మన్ బి. సత్యనారాయణ రెడ్డి మంగళవారం యాదగిరిగుట్టలోని పాత అన్నదాన సత్ర సముదాయాన్ని సందర్శించి పరిశీలించారు. వరంగల్ పర్యటనకు వెళ్తున్న సందర్భంగా యాదాద్రికి చేరుకున్న ఆయన, సాంకేతిక నిపుణులు, ఆర్కిటెక్ట్‌ల బృందంతో కలిసి భవన స్థితిగతులను పరిశీలించారు.

పాత అన్నదాన సత్రాన్ని భవిష్యత్తులో పాలక మండలి కార్యాలయంగా లేదా భక్తుల సౌకర్యాల కోసం ఎలా వినియోగించవచ్చనే అంశంపై ఆర్కిటెక్ట్‌లతో చర్చించారు. భవనం ప్రస్తుత పరిస్థితి, పునర్నిర్మాణ అవకాశాలు, అవసరమైన మరమ్మతులు, ఆధునీకరణ పనులపై సమగ్రంగా పరిశీలించి తగిన సూచనలు చేశారు.ఇప్పటికే ఆలయ పరిసరాల్లోని సైన్‌బోర్డులు, భవనాలు, వసతి సముదాయాలపై ఆర్కిటెక్చర్ బృందం నిర్వహించిన సర్వే నివేదికల ఆధారంగా పాత అన్నదాన సత్రం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని చైర్మన్ సూచించారు. భక్తులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేలా నూతన డిజైన్లను సిద్ధం చేయాలని ఆదేశించారు.

దేవస్థాన అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా నూతన పాలక మండలి పనిచేస్తోందని ఈ సందర్భంగా చైర్మన్ తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో యాదాద్రిలో కూడా ఆధునిక సౌకర్యాలను మరింత విస్తరించే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం..

**-హైవే పెట్రోలింగ్ సిబ్బందికి డీఎస్పీ శ్రావణ్ కుమార్ దిశానిర్దేశం**



ఏలూరు, జులై 27: ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె. ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు సోమవారం ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కౌన్సిలింగ్ సెంటర్‌లో హైవే పెట్రోలింగ్ సిబ్బందికి ప్రత్యేక అవగాహన, కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ హాజరై సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు.

జాతీయ రహదారులపై వాహనాలు అనవసరంగా నిలిపివేయకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని, నిలిచిపోయిన వాహనాలను వెంటనే తొలగించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే హైవేల వెంట అనధికారికంగా ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టులు, ఆహార విక్రయ కేంద్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు తదితర వాణిజ్య సంస్థల యజమానులు తమ ఖర్చుతో భద్రతా సిబ్బందిని నియమించుకోవడంతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.

హైవే భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. డీటీఆర్‌బీ ఎస్ఐ శ్రీ కె. రాంబాబు మాట్లాడుతూ, జాతీయ రహదారులపై నిలిచిపోయిన వాహనాలను వెంటనే తొలగించడం పోలీసులతో పాటు హైవే పెట్రోలింగ్ సిబ్బంది బాధ్యత కూడా అని పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీఆర్‌బీ మధు, డీటీఆర్‌బీ సిబ్బంది, హైవే పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బాధ్యతాయుతంగా వ్యవహరించాలి..

**జిల్లాలో కోవిడ్-19 నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు**
**జిల్లా అధికారులతో సమీక్షలో కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు**



చిత్తూరు, జులై 27: జిల్లాలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల (గ్రీవెన్స్) కార్యక్రమం అనంతరం జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ శాఖల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, కోవిడ్-19 నివారణ చర్యలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుదారుతో మాట్లాడి సమస్యను పూర్తిగా అర్థం చేసుకుని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని, ముఖ్యంగా విద్య, వైద్య ఆరోగ్య తదితర శాఖలు పరస్పర సమాచార మార్పిడి, సమీక్షలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలు, వైద్య శిబిరాలు, ప్రత్యేక కార్యక్రమాలపై జిల్లా యంత్రాంగానికి ముందస్తు సమాచారం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ అభివృద్ధి పనులను పరిశీలించాలని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులకు అవసరమైన శిక్షణ, అనుభవాల పంచుకోవడం, సాంకేతిక అంశాలపై అవగాహన పెంపు అవసరమని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని, ముఖ్యంగా ఆర్థికేతర అంశాలను శాఖల స్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

భూ సమస్యలకు సంబంధించి వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా కేసులకు సంబంధించిన కౌంటర్ అఫిడవిట్లు, కౌంటర్ ఫైల్స్ దాఖలు చేశారా లేదా అనే అంశాన్ని వెంటనే పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న వాటిని ఆలస్యం చేయకుండా దాఖలు చేయాలని సూచించారు.

జిల్లాలో కోవిడ్-19 వ్యాప్తి నివారణకు విస్తృత స్థాయిలో ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కోవిడ్‌పై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని తెలిపారు. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉన్నవారిని వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి

మహబూబ్‌నగర్, జులై 27:విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని కొత్తపల్లి సర్పంచ్ నర్సిములు అన్నారు. సోమవారం నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని కొత్తపల్లి పాఠశాలను ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా పాఠశాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నాణ్యత, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల పరిస్థితి, ఇతర మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

చదువుతో పాటు విద్యార్థులను వివిధ రంగాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దాలని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివశంకర్, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# కేజీఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మల్లారం ప్రభుత్వ పాఠశాలకు రైటింగ్ బోర్డుల పంపిణీ




కామారెడ్డి, జులై 27: నిజామాబాద్ మండల పరిధిలోని మల్లారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో కేజీఎఫ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం ఉచితంగా రైటింగ్ బోర్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐఉఈ ట్రస్ట్ ఫౌండర్ జేసీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

ప్రతీ చిన్నారికి విద్య, ఆరోగ్యం, క్రీడలు అనే మూడు ప్రధాన రంగాల్లో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, ఆరోగ్య సేవలు, క్రీడా అవకాశాలను అందిస్తూ వారి భవిష్యత్ అభివృద్ధికి తమ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. , జనరల్ సెక్రటరీ నాగేందర్, ట్రస్ట్ సభ్యులు కలిసి విద్యార్థులకు రైటింగ్ బోర్డులను అందజేశారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.